ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

జనవరి 25, 2015

ఓ మైగాడ్...

ఫక్తు పౌరాణికం గోపాలా!

కలానికి సంకెళ్లు

నన్ను నేను నిరూపించుకోవాలి

అక్షర హాసన్! కొత్తగా పరిచయం అవసరంలేని పేరు. నట కుటుంబానికి చెందిన అమ్మాయిగా... కమల్ హాసన్, సారిక కుమార్తెగా... సుపరిచితురాలు. వారి కూతురిగా కాక... తనకంటూ ఓ గుర్తింపు వుండాలన్న తపనతో... దర్శకత్వంలో శిక్షణ కూడా పొందినప్పటికీ... నటిగా... అరంగేట్రం చేస్తున్న అక్షర అంతరంగం...

• • • • • • • • • • • • • • • • • •

బాల్కీ సర్, అమితాబ్ బచన్, ధనుష్‌తో తొలి చిత్రం (షామితాబ్) చేసే అవకాశం వచ్చినందుకు అదృష్టవంతురాలిని. నిజానికి మొదట సినిమా స్క్రిప్టు చదివి వినిపించి...ఎలా వుందని అడిగారు బాల్కీ సర్. కథ చెప్పిన విధానం నాకెంతో నచ్చి వెంటనే బావుందనేశాను. అయినప్పటికీ ఆయన నాకు రెండురోజుల సమయం ఇచ్చారు ఆలోచించుకోమని. అమ్మ (సారిక)తో కూడా చర్చించాను. తన అభిప్రాయం చెప్పి నన్నే నిర్ణయించుకోమంది. ఏది ఎంచుకున్నా తనకు సంతోషమేనంది. నాకైతే కథ విపరీతంగా నచ్చేసింది.

- ‘షామితాబ్’ తర్వాత...ఏంటనేది నేను చెప్పలేను. కానీ ఈ చిత్రంతో సినీ పరిశ్రమలో ఓ గౌరవప్రదమైన స్థానం మాత్రం సంపాదించుకోవాలని కోరిక. ఏం జరుగుతుందో సినిమా విడుదలయ్యాక తెలుస్తుంది. నేను చూసినంతలో...నటీనటుల పిల్లలందరూ మంచి నటులు కాలేదు. నా వరకు నేను బాగా కష్టపడి పని చేస్తున్నాను.
- నన్ను నేను ఆవిష్కరించుకునే స్వేచ్ఛ నాకు వుంది. సినిమా రూపకల్పనకు సంబంధించిన కీలకమైన అంశాలను నేర్చుకునే ప్రయత్నం చేశాను. ఇప్పుడు నటనలో నిలదొక్కుకోవాలను కుంటున్నాను.
- అమ్మలో ఓర్పు... సహనం... పరిపక్వత... చాలా ఎక్కువ. అంతేకాదు. తను అందగత్తె కూడా. నా తల్లిదండ్రులిద్దరూ మంచి ఆలోచనాపరులు. వాళ్లలా...అప్పడప్పుడు నేను కూడా లోతైన ఆలోచనల్లో పడిపోతుంటాను! కొద్దిగా నాన్నలా మాట్లాడుతుంటాను. నాకు పరిశీలన ఎక్కువే.
- నేను అమ్మతో కలిసి వుంటాను. దాంతో నాన్నతో ఎక్కువగా ఫోన్‌లోనే మాట్లాడుతుంటా. ఏ పని చేసినా ఆయనతో మాట్లాడి... సలహాలు తీసుకుంటుంటాను. ఆయననే కాదు! కుటుంబంలో అందరి సలహాలు అందుకుంటుంటా.
- మణిరత్నం సర్ తన సినిమాలో చేయమని నన్ను అడిగేటప్పటికి డాన్స్, దర్శకత్వం... వంటివి నేర్చుకుంటున్నా, అప్పటికి మానసికంగా, శారీరకంగా... నటించడానికి సిద్ధంగా లేను. దాంతో ఆ పాత్రకి నూటికి నూరు శాతం న్యాయం చేయలేననిపించింది.
- ఓ సినిమాకి... వాణిజ్య ప్రకటనలకు...సహాయ దర్శకురాలిగా చేశాను. ఖాన్‌లందరితో పని చేయాలని కోరిక. షారుక్‌ఖాన్ నటించిన ప్రకటనలకు పని చేశాను. అప్పుడు కొంచెం కంగారుగా వుండేది. “అక్షరా... బాగా చేయ్! సారిక...కమల్ కూతురిగా కాక...నీ శక్తి సామర్థ్యాలతో నిన్ను నువ్వు నిరూపించుకో...’ అని నాకు నేను చెప్పకుంటూ వుండేదాన్ని. డైరెక్టర్ ఈ విషయాన్ని షారుక్‌కి చెప్పినప్పుడు “అరే అక్షరా! ఎంత అందంగా వున్నావ్ నువ్వు... అచ్చంగా సారిక లాగా...’ అని మెచ్చుకున్నారు. ఆ మాటలు ఇప్పటికీ గుర్తొస్తుంటాయ్! •

అమ్మ సారికతో

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

పోటాపోటీగా!

వారూ... వీరూ... అనేముంది! అందరూ పోటీలు పడి మరీ సలహాలిచ్చేస్తున్నారు. అందులో సన్యాసులూ వుంటున్నారు. రాజకీయ నాయకులూ వుంటున్నారు. సంసార సాగరాన్ని ఈదడం తమ వల్ల కాదనుకున్న వారు సన్యాసులు. జగమంత కుటుంబం తమదని గొప్పలు చెప్పకునేవారు రాజకీయ నాయకులు. వీరిద్దరూ పోటీలు పడి మరీ స్పందిస్తున్న విషయమే 'పిల్లలు (సంతానం)'.

ఇది వరలో ఒక్కరు ముద్దు. ఇద్దరు హద్దు అనేవారు. దీనికంటే ముందు ఒక్కరు లేదా ఇద్దరు అనేవారు. గోడల మీద బొమ్మలేయించి మరీ నిరక్ష్యరాస్యులకు సైతం నాటుకునేలా ప్రచారం చేసేవారు. ఇప్పడు సీన్ రివర్స్ అయ్యింది.

'నలుగురు పిల్లలైనా లేకపోతే ఎట్లా?!' అని ఒకరంటే...'అబ్బెబ్బే... కనీసం ఆరుగురైనా వుండాల్సిందే' నని మరొకరు కుండ బద్దలు కొట్టి చెప్తున్నారు. 'అర్రే...పదిమంది పిల్లలు లేని ఇల్లు బోసి పోదూ' అంటున్నారు కొందరు ఢంకా భజాయించి మరీ.

సలహాలివ్వడంలో అందరూ ఇలా చెలరేగిపోతుంటే ... సీఎంగా సుదీ...ర్ఘానుభవం కలిగిన వారు చూస్తూ ఊరుకుంటారా! స్వరం సవరించుకొని మరీ సలహాలు గుప్పించేస్తున్నారు. గతంలో చేసిన తప్పిదానికి కుమిలిపోతూ... కళ్లు మూసుకొని గంపెడు పిల్లల్ని కనేయమంటున్నారు. 'విజన్ 2020' నుంచి 'చిల్డ్రన్ 20' సిద్ధాంతానికి షిఫ్టయిపోయారు. సాక్షి మహారాజ్ నుంచి పొందిన స్ఫూర్తి పుణ్యమేనేమో ఈ షిఫ్టింగ్!

పెద్దలు...అనుభవజ్ఞులు...పూజ్యులు చెప్పారని ...ఆడవాళ్లు పిల్లల్ని కనే యంత్రాల్లా మారిపోయారే అనుకోండి! గంపెడు పిల్లల్ని కనాలనే అనుకున్నారనుకోండి! స్కానింగ్‌లు వగైరాలు లేకుండా... ఆడపిల్లల్ని కూడా కననిస్తారా? లేక మగపిల్లల్ని మాత్రమే కనాలా?! ఓకే! ఆడ...మగ ... సంగతి పక్కన పెట్టి... పదేసి మందిని కన్నారే అనుకోండి. వారికి తిండి పెట్టేదెలా? చదివించేదెలా? అన్నిటినీ మించి మంచి భవితను ఇచ్చేదెలాగో ఆలోచించుకోవొద్దూ?!

పులిని చూసి నక్క వాత పెట్టుకున్న చందంగా... ఎవరో ఎక్కువ మంది పిల్లల్ని కనేస్తున్నారని ... మిగతా వారూ కనేస్తే...వాతలు...గాయాలే మిగులుతాయి మరి. ■



◆ మనలో మాట



టపా

సంక్రాంతి గురించి బాగా వివరించారు

జనవరి 11 ఆదివారం అనుబంధం 'స్నేహ'లో 'డూ...డూ బసవన్న' మనలో మాట శీర్షిక బాగుంది. అందులో రాజకీయ, సామాజిక అంశాలను సంధించడం, దానికి వ్యంగ్యం జతకలవడంతో మమ్మల్ని ఎంత గానో ఆకట్టుకుంది. 'సొంతూరు సంక్రాంతి' అట్టమీది కథ బాగుంది. పట్నజీవనం గడిపే వారంతా సంక్రాంతికి సొంతూరు వెళ్లడం, అక్కడ ఎదురయ్యే అనుభూతులు, అనుభవాల గురించి చక్కగా వివరించారు. 'రుచి'లో సంక్రాంతి వంటకాలు అలరించాయి. 'రేచీకటి అల్లుడు' కథ ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించింది. 'స్ఫూర్తి' టీం ఇండియాలో చోటు దక్కించుకున్న రాయుడి క్రికెట్ జీవితం గురించి ఆసక్తికరమైన విషయాలు తెలియచేసారు. సంక్రాంతి సంబరాల్లో గుజరాత్‌లో జరిగే గాలిపటాలపోటీ, తమిళనాడులో జరిగే జల్లికట్టు గురించి చదువుతుంటే సంక్రాంతి తెలుగునాటే కాదు ఇతర రాష్ట్రాల్లో కూడా ఇది ప్రత్యేకత కలిగిన పండగని తెలుస్తుంది.

- ఖలీదు క్రాంతి కుమార్, దర్శి

పెద్ద లోటు

జనవరి11 స్నేహలో సంక్రాంతి శోభ కనపడింది. పండుగకు సంబంధించిన అనేక విషయాలను ఇవ్వడం బాగుంది. సమ్‌థింగ్ స్పెషల్‌లో వింత పెళ్లి ఆస్తుల గోల నిజంగా వింతగానే అనిపించింది. 'నివాళి' మనసును కదిలించే మాటకారిలో గణేష్ పాత్రో సినిమా మాటల గురించి చక్కగా వివరించారు. ఆకలిరాజ్యం, సీతారామయ్య గారి మనమరాలు వంటి నాటి సినిమాలకే గాక ఈ మధ్య కాలంలో వచ్చిన సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రానికి గోదావరి మాటల సువాసనలు రుచి చూపించిన పాత్రో మరణం చిత్రసీమకు పెద్ద లోటు. మధ్య తరగతి మనషుల మనసుల్లోని మాటలను సెల్యులాయిడ్‌పై పలికించడంలో దిట్ట గణేష్ పాత్రో. చూద్దామాలో ఆంకోర్ వాట్ ప్రాచీన ఆలయ విశేషాలు ఆకట్టుకున్నాయి.

- కె. దివ్య, నరసరావుపేట

సాహసమే!

'టెక్ గురు'లో కొత్తగా... సాంకేతిక పరికరాల గురించి చదువుతుంటే టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందుతుందో తెలుస్తుంది. పిల్లల కేరింగ్‌లో ఉపయోగపడే బేబి సిట్టర్, ఏకాంతంగా పక్కవాళ్లకు ఇబ్బందికలగకుండా సంగీతం వినిపించే దిండు ఇవన్నీ భలే అనిపించాయి. రంగుల పేజీలు కూడా అబ్బురపరిచే విధంగా ఉన్నాయి. 'సిన్మా కబుర్లు'లో పాత్రకు తగ్గట్టుగా శరీరంతో సాహసాలు చేస్తున్న కథానాయకులు, నాయక గురించి ఇవ్వడం బాగుంది. ముఖ్యంగా విక్రమ్ 'ఐ' సినిమా కోసం 110 కేజీలు పెరగటం, మళ్లీ అదే చిత్రంలో మరో భాగం కోసం 45 కేజీలకు తగ్గటం అన్నది నిజంగా ఒక సాహసమే. మిగతా శీర్షికలన్నీ బాగున్నాయి. రంగుల పేజీల్లో ఆసక్తికరమైన అంశాలను, ఆకట్టుకునే విషయాల గురించి ఇస్తున్నారు.

- కె. శివవర్మ, భీమవరం

మనస్సు బరువెక్కక మానదు

జనవరి 04 స్నేహలో ప్రచురితమైన కథనాలు బాగున్నాయి. ముఖ్యంగా వేమూరి రాజేష్ గారు చెప్పిన పోలాండ్ అందాచందాలను ఆస్వాదించలేకపోయాను. కారణం రెండో ప్రపంచ యుద్ధపు ఖైదీలను చంపడానికి ఏర్పర్చిన ఒక మానవ కబేళా లాగా పోలాండు ఉన్నందువల్ల. రచయిత చాలా చారిత్రక విషయాలు తెలియచేశారు. ఇది చదివిన వారికి మనస్సు బరువెక్కక మానదు. అమ్మ కథ ఆలోచింపచేసింది. భార్యా, భర్తల మధ్య డివిజన్ ఆఫ్ వర్కు ప్రపంచమంతటా సహజ రీతిలో జరిగిందని మార్క్స్ రాసారు. ఇది పిల్లల భవిష్యత్తు కోసం జరిగింది. రచయిత సూర్యంతో తల్లి స్థానంలోకి వచ్చిన స్త్రీ ఆమె కన్న తల్లి అయినా సరే, మారుటి తల్లి అయినా సరే తల్లికుండే సహజ ప్రేమ, త్యాగం లాలిత్యం వుంటుందని చెప్పించడం బాగుంది.

- ఇలిపిల్ల సూర్యనారాయణ, భీమనవారి పేట, విజయవాడ

ఈ సంచికలో....

కళలకూ కలాలకూ సంకెళ్లు

కవర్‌స్టోరీ 14

కులతత్వ వాదులు, మతవాదులు కలిసి ఒక తమిళ రచయిత ప్రొఫెసర్ పెరుమాళ్ మురుగన్ రాసిన నవలపై చేసిన దాడి దేశంలో సంచలనం కలిగించింది. నరేంద్ర మోడీ పాలన మొదటి పాదంలోనే ఇలా జరుగుతుంటే ముందు ముందు ఈ దేశం ఎటు పోతుందనే ఆందోళన పెంచింది. అంతకు మించిన నిరసనా వ్యక్తమైంది.

కళ 17
నేను సైతం...

ప్రత్యేకం 4
ఖరీదైన దినుసు కుంకుమ పువ్వు

యువ 5
ఆ ఆలోచన కూడా దరి చేరదు

కథ 6
పాపం సుబ్బారావు

జానపదం 8
కవి ప్రేమికులు రామి - చండీదాస్

సినిమా కబుర్లు 11
ఓ మైగాడ్.. ఫక్తు పౌరాణికం గోపాలా!

సమ్‌థింగ్ స్పెషల్ 3
చెల్లని పెళ్లికి విడాకులు

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
రేగుపండుతో రకరకాలు

బాలనేస్తాలు 22
మామిళ్లు ఎన్ని వున్నాయోచ్!

కొత్త పుస్తకాలు 24
సంభ్రమాశ్చర్యాలను కలిగించే కథలు

చూద్దామా ....
మనకూ ఉంది
ఓ కాశ్మీర్ ..! 12

నేను సైతం...

◆ కళ

అమృతా మిశ్రా! ముంబై వాసి. ఇరవైఏడేళ్లుంటాయి. ఒక ప్రయివేటు సంస్థలో మేనేజర్‌గా పని చేస్తున్నారు. కార్యాలయంలో గంటల తరబడి పనిచేసి అలసి సొలసి ఇల్లు చేరాక... తనకెంతో ఇష్టమైన మరో పని మొదలెడతారు. రంగులతో చార్టు మీద తనదైన ప్రపంచాన్ని సృజించడంలో మునిగి తేలతారు. ఇదంతా...

కేవలం కళ మీదున్న ఇష్టంతోనే కాదు. అభాగ్యులకు, అనాథలకు తన వంతు సాయం చేయాలన్న తపనతోనే.

ఎదురుగా ఎన్ని రకాల చిత్ర రాజాలున్నా మధుబని పెయింటింగ్స్ ఆకర్షణే వేరు. చూపరులను ఇట్టే ఆకట్టుకుంటాయవి. అలాంటి మధుబని చిత్రాలు వేయడంలో అమృత సిద్ధహస్తురాలు. మొదట్లో గోడలకు వేళ్లాడదీసే చిత్రాలు మాత్రమే వేసేది. ఆ తర్వాత గిఫ్ట్ బాక్సులు, పేపర్ బ్యాగ్‌లు, బట్టల మీద కూడా చిత్రాలు వేయసాగింది. సంప్రదాయ మధుబని చిత్రకారులు రామాయణంలోని ఘటనలనే చిత్రిస్తుంటారు. మరీ ముఖ్యంగా సీతారాముల కళ్యాణం, ఆ సందర్భంగా జనకుడి ఇంట్లో జరిగే ఉత్సవాలనే ఎక్కువగా ఎంచుకుంటారు.

నిజానికి ఈ కళను ఆమె ఏ గురువు దగ్గరా శిష్యరికం చేసి అభ్యసించలేదు. ఇంటర్నెట్, పుస్తకాలు చూసి ఏకలవ్యుడిలా పట్టు సంపాదించారు. వాటిని ఆన్‌లైన్ పత్రికలు, సామాజిక వెబ్‌సైట్ల ద్వారా విక్రయిస్తారు. అలా సేకరించిన పైకాన్ని అజినాథ్, అంజలి వంటి అనాథ పిల్లలకోసం, నిరుపేదలకోసం ఖర్చు చేస్తారు.

ప్రస్తుతం అమృత దృష్టంతా అజినాథ్ చదువు కోసం డబ్బు కూడబెట్టడం మీదే వుంది. ఈ చిన్నారి అనాథ మాత్రమే కాదు. హెచ్ఐవి పాజిటివ్ పిల్లాడు కూడా. మహారాష్ట్ర అహ్మద్‌నగర్‌లో అమ్మమ్మతో కలిసి జీవిస్తుంటాడు. అజినాథ్ గురించి అమృతకు ఓ డాక్యుమెంటరీ వల్లే తెలిసింది. కాటరాక్ట్ ఆపరేషన్‌కు సంబంధించి తీసిన ఆ డాక్యుమెంటరీ చిత్రంలో అజినాథ్ ప్రధాన పాత్ర పోషించాడు. ఆపరేషన్ తర్వాత ఆ చిన్నారి చదువుకయ్యే ఖర్చంతా తామే భరిస్తామని డాక్యుమెంటరీ నిర్మాతలు వాడికి చెప్పారట. అయితే షూటింగ్ అయిపోయాక ఇచ్చిన మాటను విస్మరించారు. కానీ అజినాథ్ మాత్రం షూటింగ్ సమయంలో వేసుకున్న స్కూలు యూనిఫారమ్‌లోనే వీధులన్నీ తిరగసాగాడు. ఎప్పటికైనా స్కూలుకు వెళ్లకపోతానా అన్న ఆశ వాడి అమాయకపు కళ్ల నిండా వుందంటుంది అమృత. వాడి చిన్ని కోరిక తీర్చాలన్న తపన ఆమెలో బలంగా వుంది. అందుకే వీధి బాలలను అక్కున చేర్చుకునే 'చైల్డ్ లైన్ ఇండియా ఫౌండేషన్' వారితో మాట్లాడి దేశదిమ్మరిలా తిరుగుతున్న అజినాథ్‌కు ఓ గూడు ఏర్పాటు చేశారు.

థానేలోని మా నికేతన్ అనే అనాథాశ్రమ బాలిక అంజలి చదువు బాధ్యత కూడా అమృతే తీసుకున్నారు. పండుగలు పబ్బాలప్పుడు

ఆశ్రమానికి వెళ్లి ఆ ఎనిమిదేళ్ల పాపతో ఆడిపాడటమంటే అమృతకెంతో ఇష్టం. తన సొంత కాళ్ల మీద బతకగలిగేంత వరకు అంజలికి అండగా వుండాలన్నది అమృత కోరిక.

నిజానికి ఇలా కష్టాల్లో వున్న వారికి చేతనైన సాయం అందించాలన్న ఆలోచన అమృతలో రెండేళ్ల కిందట తొలిసారిగా కలిగింది. కోలన్ (పెద్ద పేగు) క్యాన్సర్‌తో బాధపడుతున్న యాభయ్యేళ్ల సుహాసిని కదమ్ దయనీయ గాథ అమృతను కదిలించింది. క్యాన్సర్ సోకిందన్న విషయం తెలిసిన వెంటనే కొడుకులు ఆమెను వదిలించుకున్నారు. వాచ్‌మెన్‌గా భర్తకు వచ్చే ఆదాయం ఒక్కసారి కీమోథెరపీకి కూడా సరిపోయేది కాదు. సరిగ్గా ఆసమయంలో వారిని అమృత ఆదుకుంది. సుహాసిని చికిత్స కోసం 60 వేల రూపాయలను సేకిరించింది. తన ఆదాయం, పోగు చేసిన విరాళాలు కాక... మరేదైనా మార్గం వుంటే బావుండనుకుంది. అప్పుడే తనకెంతో ఇష్టమైన మధుబని చిత్రకళ మదిలో మెదిలింది. ఇక తర్వాత జరిగిందంతా మీకు తెలిసినదే.

ఎప్పటికైనా మధుబనిపై పట్టు సాధించాలని ... ఆర్ట్ ఎగ్జిబిషన్ నిర్వహించాలని అమృత ఆశ. దాతృత్వం గురించి చెప్పమంటే అమృత ఏమంటారో తెల్సా! "చాక్లెట్ తినాలని ఎవరికి మాత్రం వుండదు! ఆ కోరికను చంపుకొని... ఆ డబ్బుతో పేదలకు సాయం చేయడమే చాలా కష్టం. మనకు మిగులు వున్నప్పుడు దానం చేయడం కాదు! వున్న దాంట్లోంచి ఇతరులకు సాయం చేయడమే అసలైన దాతృత్వం' అని. ✦

◆ ప్రత్యేకం

ఖరీదైన దినుసు కుంకుమ పువ్వు

కుంకుమ పువ్వు తెలియని వాళ్లు ఉంటారా? కనీసం పేరైనా వినే వుంటారు. ఒకప్పుడు ఆడవాళ్లు ఇంతేసి కుంకుమ బొట్లు పెట్టుకునేవాళ్లు. ఇప్పుడటువంటి ఆచారాలు కాస్త సన్నగిల్లినా రకరకాల పద్ధతుల్లో కుంకుమ వాడుతూనే వున్నారు. ఇంతకీ దాని విశేషాలేంటి? సేకరించడం ఎంత కష్టం? వంటి వివరాలు ....

కుంకుమ ఒక మసాలా దినుసు. చాలామంది దీనిని అలంకరణకు వాడుతున్నా, ఇంకా చాలా మంది కుంకుమను వంటల్లో వాడతారు. ముఖ్యంగా ఇరాన్‌లో బిర్యానీ తయారీలో వాడతారు. వంటకాలకి సహజమైన, ఆకర్షణీయమైన రంగునివ్వడంలో కుంకుమను మించింది లేదు. అయినా మామూలు రంగు పొడికి ఇంత విలువా? అనిపించొచ్చు. ఇది మామూలు విలువ కాదు! సాధారణంగా మసాలా దినుసులు కాస్త ఖరీదైనదే. కుంకుమను మించిన ఖరీదైన దినుసు మరోటి లేనట్టే. కుంకుమ విలువ (బరువుకి బరువు) దాదాపు బంగారంతో సమానం! పెరిగిన డిమాండుతో పాటు కుంకుమని పెంచడానికి అవసరమైన వాతావరణమూ, అటువంటి వాతావరణంలో కూడా చాలా సున్నిహితంగా పెరిగే లక్షణమూ కుంకుమని అరుదైన పదార్థాంగా చేసేశాయి. ఖరీదైనదిగానూ చేశాయి.

పువ్వా? కాయా?

ఇంత అరుదైన దినుసు ఎలా వస్తుంది? అసలు ఇది కాయా, ఆకా, పువ్వా? మనం కుంకుమ పువ్వు అంటాం కానీ... పూర్తిగా అలా అనడానికి కూడా లేదు. ఎందుకంటే అవి పువ్వులోని పోగులు మాత్రమే. ఉల్లిపాయలాంటి దుంపనుండి వచ్చే మొక్కకి వంకాయ రంగులో పూలు పూస్తాయి. పూల రేకలు వంకాయ రంగులో వున్నా, వాటి మధ్యలో నుండి మూడు (మూడంటే మూడే) సన్నని, ఎర్రని దారపు పోగుల్లాంటి స్త్రీ ప్రత్యుత్పత్తి భాగాలు (వీటినే స్టిగ్మాలంటారు) వస్తాయి. 'కుంకుమ' అనే పదార్థం ఇచ్చేది ఈ పోగులే. నిజానికి ఇవే కుంకుమ.

ఈ పోగుల్ని జాగ్రత్తగా వేరుచేసి, ఎండబెట్టి, అలాగే కానీ, పొడిచేసి కానీ వాడతారు. స్వచ్ఛమైన కుంకుమకి చేదు రుచి, ఒక విధమైన ఎండుగడ్డి వాసన వుంటాయి. దానిలో క్రోసిన్ అనే ఒక రకమైన వర్ణకం వుంటుంది. దీనివల్ల మంచి గాఢమైన బంగారు పసుపు రంగు వస్తుంది. ఈ రంగునే అరబిక్ పర్షియన్ పదాల మూలంలో 'జాఫ్రాన్' అంటారు. దానినుండే ఇంగ్లీషులో 'శాఫ్రాన్' మాట వచ్చింది. హిందీలో 'కేసర్' అనీ, ఉర్దూలో 'కాంగ్' అనీ అంటారు.

సేకరించడం ఎంత కష్టమో!

అసలు కుంకుమ పువ్వును సేకరించడం ఎంత కష్టమైన ప్రక్రియో తెలుసా? ఇది అన్ని చోట్లా పెరగదు. పశ్చిమాన మెడిటరేనియన్ నుండి తూర్పున భారత దేశం వరకు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే పెరుగుతుంది. మొత్తం ప్రపంచ వ్యాప్తంగా ఏటా కేవలం 300 టన్నులు మాత్రమే కుంకుమ ఉత్పత్తి జరుగుతుంది. అందులో దాదాపు 94 శాతం ఉత్పత్తి ఇరాన్ నుండి వస్తుంది.

ఇరాన్ కాక భారతదేశం, స్పెయిన్, గ్రీసు, అజర్‌బైజాన్, ఇటలీలలో కూడా కుంకుమ పువ్వు ఉత్పత్తి జరుగుతుంది. ఈ మధ్య న్యూజిలాండ్, కాలిఫోర్నియాలో కూడా కుంకుమ పువ్వు సాగు జరుగుతోంది. అరకిలో కుంకుమ సమకూరడానికి దాదాపు 75000 నుండి లక్ష పూలు కావాల్సి ఉంటుంది. అంటే దాదాపు మూడు లక్షల 'పోగులు' అవసరం! అంటే ఒక ఫుట్‌బాల్ మైదానమంత కుంకుమ పంట అవసరం. అన్ని పూల నుండి పోగులను వేరు చేయడానికి సుమారు 30–35 గంటల శ్రమపడాలి. పోగులను వేరు చేసిన వెంటనే వీలైనంత త్వరగా గాలి చేరని డబ్బాల్లో పెట్టి ఎండబెడతారు. ఇంత కష్టమైంది కాబట్టి కుంకుమకి అంత ఖరీదు, విలువ. ఒక కిలో నాణ్యమైన కుంకుమ పోగులు సుమారు అయిదు లక్షల రూపాయల పైమాటే! మరో మాట – పూల సేకరణ సూర్యోదయానికి ముందే ముగుస్తుంది!

అయితే నాణ్యమైన, నిఖార్సైన కుంకుమ లభించడం కష్టం. ఎందుకంటే కల్తీ విపరీతంగా వుంటుంది. యూరప్‌లో మధ్యయుగాల్లోనే

కుంకుమని కల్తీ చేయడం ఆరంభమైంది. అలా చేస్తూ పట్టుబడ్డ వారిని 'శాఫ్రాన్ చౌ కోడ్' ద్వారా మరణశిక్ష విధించేవారు. దానిమ్మ పోగులు, రంగువేసిన పట్టుపోగులు, లేదా కుంకుమ పూలలోనే రుచి, వాసన లేని పసుపు రంగు స్టేమెన్లు(పురుష ప్రత్యుత్పత్తి పోగులు) కలిపి కల్తీ చేయడం పరిపాటి. ఇక కుంకుమ పొడిని కల్తీ చేయడానికి వందలాది పద్ధతులున్నాయి. విశేషమేమిటంటే – మన దేశంలో కాశ్మీరులో చాలా నాణ్యమైన కుంకుమ పువ్వు పండుతుంది. కానీ దానిలో చౌకగా దిగుమతి ఆయన ఇరాన్ కుంకుమ కలిపి అమ్మేస్తుంటారు!

ప్రాచీనం...

కుంకుమను వైద్యంగానూ ప్రాచీన కాలం నుండి వాడుతూనే వస్తున్నారు. ఈ విధంగా గ్రీసులోనూ వాడారు. యూరోపియన్లు ఆస్తమా, మసూచి, జలుబులకు మందుగా కుంకుమని వాడేవాళ్లు. ఈజిప్షియన్లు దీనిని లైంగిక సామర్థ్యం పెంపొందించేందుకు వాడేవాళ్లు. ప్రస్తుతం దీనిని క్యాన్సర్ నివారణగా వాడుతున్నారు. ఇక క్లియోపాత్రా రాణి అయితే శరీరమంతా కుంకుమ పూసుకుని శరీరానికి కొత్త కాంతులు పొందేవారట. గర్భవతులు కుంకుమ పువ్వు కలిపిన పాలు తాగితే పుట్టబోయే బిడ్డకు మంచి రంగు వస్తుందని కొంతమంది చెపుతారు. గ్రీకు చర్చిల్లో జరిగే పలు ఆచార వ్యవహారాల్లో దీనిని ఉపయోగించేవారంటారు.

కాశ్మీరులో మోంగ్రా లేదా లాచా కుంకుమ పండుతుంది. ప్రపంచంలోకెల్లా అతి గాఢమైన ఎరుపు రంగులో ఉండేదీ, అనేక కారణాల వల్ల అతి అరుదైనదీ, అందుకే అతి విలువైనదీ కాశ్మీర్ కుంకుమే!

ఆ ఆలోచన కూడా దరి చేరదు

జీవితాన్ని ప్రేమిస్తాను. మరణాన్నీ ప్రేమిస్తాను. దేశ స్వాతంత్ర్యం కోసం ఉరితాడును సైతం నవ్వుతూ ముద్దాడుతానన్న భగత్ సింగ్...రెండు పదుల వయస్సులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన విప్లవ వీరుడు. చరిత్ర మిగిల్చిన నవ యువకుడు. ఆయన త్యాగం యువతరానికి ఆదర్శం. భవిష్యత్తు తరానికి మార్గదర్శి. ప్రపంచంలోని పీడిత ప్రజలందరూ ఏకం కావాలని కోరిన మహోన్నత వ్యక్తి. ప్రజల ఒత్తిడి వల్ల తమ ఉరిశిక్షను యావజ్జీవ శిక్షగా మారిస్తే, అంతకన్నా ఆత్మహత్య చేసుకోవడం మేలని విప్లవ సహచరుడు సుఖదేవ్ రాసిన ఉత్తరానికి సమాధానంగా ప్రాణాల విలువను వివరిస్తూ భగత్ రాసిన లేఖలోని సారాంశం ఇది.

ప్రియ సోదరా!

నీ ఉత్తరాన్ని పదే పదే చాలా శ్రద్ధగా చదివాను. పరిస్థితుల్లో వచ్చిన మార్పు మనపై భిన్న ప్రభావం చూపిందని గుర్తించాను. నీకు ఇప్పటికీ జ్ఞాపకముండుంటుంది. ఒకరోజు నేను ఆత్మహత్య గురించి చర్చించాను. కొన్ని పరిస్థితుల్లో ఆత్మహత్య సమర్థనీయం కావచ్చు అన్నాను. ఆనాడు నువ్వు నా అభిప్రాయంతో విభేదించావు. చర్చా స్థలం, సమయం కూడా నాకు బాగా గుర్తున్నాయి. షామంషాహీ కుటీరంలో ఒక సాయంకాలం పూట ఆ చర్చ జరిగింది. అలాంటి పిరికి పని ఏ పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని నీవు హేళనగా మాట్లాడావు. ఈ విషయంలో ఇప్పుడు నీ అభిప్రాయం పూర్తిగా తలకిందులైంది. నా విషయానికొస్తే దీనిపై మొదట్లో నీకున్న అభిప్రాయమే ఇప్పుడు నా అభిప్రాయం. ఆత్మహత్య ఓ అసహ్యకరమైన నేరం. పూర్తిగా పిరికివాడు చేయవలసిన పని. విప్లవకారుని సంగతి పక్కన పెట్టి మామూలు మనిషి ఎవరైనా కూడా దీన్ని సమర్థించరు.

"కష్టాల్ని భరించడమే దేశ సేవ ఎలా అవుతుందో నాకు అర్థం కావడంలేదని" నీవు రాశావు.

నీవంటి వ్యక్తి నుండి ఈ మాటలు రావడం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. నౌ జవాన్ భారత్ లక్ష్య ప్రకటనగా "మనం ఎంచుకున్న సేవలలో కష్టాలను సహిష్ణుత, ప్రాణత్యాగ్యం" అన్న మాటను మనం ఎంతో ఇష్టపడేవాళ్లం. నువ్వు చేయగలిగినంత సేవ చేశావు. ఇక ఇప్పుడు కష్టాలను భరించే సమయం. మరొకటి నువ్వు దేశప్రజలందరికీ నాయకత్వం అందించవలసిన సమయం కూడా సరిగ్గా ఇదే.

మనం అరెస్టయివచ్చినప్పుడు జైళ్లలో రాజకీయ ఖైదీల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉండేది. మనం దాన్ని మెరుగుపరిచే కృషి ప్రారంభించాం. త్వరలోనే మనం చనిపోవడం తథ్యమని నేను అనుకున్నాను. మనం నిరాహారదీక్షకు దిగినపుడు బలవంతంగా ఆహారం ఎలా పంపిస్తారో మనకు తెలియదు. చావుకు సిద్ధమై దిగాం. అంటే మనం ఆత్మహత్యకు పాల్పడుతున్నామని నీ భావనా? అలా కాదు. ఒక మహోన్నతాశయం కోసం ప్రాణాలర్పిండటం ఎన్నటికీ ఆత్మహత్య కాజాలదు. మన మిత్రుడు జతీన్‌దాసు అమరత్వం మనకు అసూయ గొల్పుతుంది. అది ఆత్మహత్య అంటావా? మనం కష్టాలను భరించిడం వల్ల చిట్టచివరకు మంచి ఫలితాలే కలిగాయి. దేశవ్యాపితంగా ఒక బ్రహ్మాండమైన, ఉద్యమం ఆరంభమయింది. తద్వారా లక్ష్య సాధనలో మనం విజయం సాధించాం. ఇలాంటి పోరాటాలలో చనిపోవడమంటూ జరిగితే, అది ఆదర్శ మరణం అవుతుంది. బాధలను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవడం, దుఃఖాల నుండి తప్పించుకునేందుకు ప్రాణాలు తీసుకోవడం పిరికితనమవుతుంది. జీవితంలో ప్రతిబంధకాలు మనిషిని పరిపూర్ణుడ్ని చేస్తాయని నేను చెప్పదలచాను.

మనలాంటి వాళ్లం ప్రత్యేక దృష్టితో విప్లవకారులమయినందుకు గర్వపడుతుంటాం. అలాంటి వాళ్లం ఎప్పుడైనా ఎక్కడైనా ఎలాంటి కష్టనష్టాలైనా ఆందోళనలైనా బాధలు విచారాలైనా సహించేందుకు సంసిద్ధం కావాలి.

జైలులో జీవితం నీకు అవమానకరంగా అనిపించేట్టయితే అందుకు వ్యతిరేకంగా పోరాడి సరిదిద్దడానికి ఎందుకు ప్రయత్నించకూడదు? దేశంలో వాతావరణాన్ని మార్చడానికి మనవంతు దోహదం అందించామన్నది నిజమే కాని, మనం కాలం అవసరం నుండి పుట్టుకొచ్చిన వాళ్లం మాత్రమే. ఈ కష్టమయిన పనిని మన మీద వేసుకున్నాము కనుక దాన్ని కొనసాగిస్తూ, ముందుకు తీసుకుపోవాల్సిందే. అంతే తప్ప కష్టాలు వచ్చాయని బలవంతంగా ప్రాణాలు తీసుకుంటే అది ప్రజలకి మార్గదర్శకం వహించడం కాదు. అభివృద్ధి నిరోధక చర్య అవుతుంది.

మానవ జీవితం భగవంతుడి ఇష్ట ప్రకారం నడుస్తుందని మనం నమ్మం. కాబట్టి చావు పుట్టుకలను గురించి మనం భౌతికవాద కోణంలో ఆలోచించాలి. కొందరు సి.ఐ.డి అధికారులు ఇలాంటి చావు(ఉరిశిక్ష) ఆత్మహత్యతో సమానమన్నారు. "నా వంటి భావాలు గల వ్యక్తి నిష్కారణంగా చావాలనుకోడని నేను బదులిచ్చాను. మా జీవితాల విలువ సాధ్యమైనంత ఎక్కువగా పెంచుకోవాలనే మేము చూస్తాము. వీలైనంత ఎక్కువగా మానవాళికి సేవ చేయాలని చూస్తాం. ప్రత్యేకించి ఏనాడూ ఎలాంటి దిగులూ, నిరుత్సాహం దరిచేరని నా వంటివాడు ఆత్మహత్య చేసుకోవడం కాదు గదా, దాని గురించిన ఆలోచనైనా రానివ్వనన్నాను. అదే మాట నీకూ చెబుతున్నాను.

నాకు ఖచ్చితంగా ఉరిశిక్ష పడుతుంది. క్షమాభిక్ష ఏ మాత్రం కోరుకోవడం లేదు. మన విడుదలకై జరిగే ఉద్యమం మూకుమ్మడిగా, ప్రపంచవ్యాపితంగా జరగాలని కోరుకుంటున్నాను. ఈ ఉద్యమం తారాస్థాయికి చేరినప్పుడు మనల్ని ఉరి తీసెయ్యాలి. నా కోరిక ఏమిటంటే ఏదైనా గౌరవప్రదమైన రాజీ అంటూ కుదిరితే దానికి మనబోటి వ్యక్తుల విషయం ఓ అడ్డంకి కారాదు. ఒక దేశ భవిష్యత్తు నిర్ణయించే సందర్భంలో వ్యక్తుల భవితవ్యాన్ని పూర్తిగా పక్కనపెట్టాల్సి ఉంటుంది. విప్లవకారులమయిన మనం, మన పాలకులు ప్రత్యేకించి తెలజాతి వారి ఆలోచనల్లో ఇటువంటి ఆకస్మిక పరివర్తన వస్తుందని అనుకోము. నిరంతర కృషి, కష్టాలు. త్యాగాల వల్ల తప్ప...ప్రేమ, నైతిక విలువలు అలాంటి ఆశ్చర్యకరమైన మార్పు రాదు. దేశ ప్రజల హృదయాల్లో మా ఉరిశిక్ష చెరగని ముద్రవేస్తే అంతకన్నా కావలసింది లేదు. అప్పుడు మిగిలిన అందరికీ సదుపాయాలు, క్షమాభిక్షలకూ ఎప్పుడూ హృదయపూర్వకంగా స్వాగతం చెబుతాను. అంతకి మించి చెప్పదలచుకున్నది మరేం లేదు.

ఇట్లు
భగత్‌సింగ్

◆ కథ

పాపం సుబ్బారావు

సుసర్ల సర్వేశ్వర శాస్త్రి

9989397651

సుబ్బారావు ఓ చోటా లీడర్. నిజం చెప్పాలంటే ఒక సప్లయిర్. హోటల్‌లో టిఫెన్లు సప్లయి చేసే సర్వరు కాదు సుమండి! అలాగే దుకాణాలకు సామన్లు, వస్తువులు సప్లయి చేసే సప్లయర్ కూడా కాదులెండి. అతను మనుషులను సప్లయి చేసే సప్లయర్. కంగారు పడకండి, అతగాడు మనుషులను కిడ్నాప్ చేసి విదేశాలకు సప్లయిచేసే వాడు కాదు. మీటింగులకు, సన్మాన సభలకు, ఏ సభలకైనా ప్రేక్షకులను అందించే సప్లయిర్. పెళ్లిళ్లలో, విందు వినోదాల్లో ఆహార పదార్థాలు సప్లయి చేసే కేటరింగ్ సంస్థలను చూసిన ప్రేరణతో ఇతగాడు ఒక సంస్థ ప్రారంభించాడు. రాజకీయ పార్టీల పుణ్యమా అని ఊరేగింపులకు, ధర్నాలకు, సమావేశాలకు పార్టీలతో పని లేకుండా అందరికి మనుషులను సప్లయి చేస్తుంటాడు. నిరుద్యోగులైన యువకులకు, మహిళలకు ఇతడొక వరప్రసాదం అని చెప్పుకోవచ్చు. అన్ని వయస్సులవారు ఇతని వద్ద పేరు నమోదు చేయించుకుంటే వారి ఉపాధికి ఢోకా లేకుండా చూసుకుంటాడని అతన్నెరిగిన వారి నమ్మకం. ఒక విధంగా సిన్మాలకి జూనియర్ ఆర్టిస్టులను సప్లయి చేసే పనిలాంటిదే. అక్కడ వారి పేర్లు టైటిల్స్‌లో వేస్తారు. ఇక్కడ సుబ్బారావు ఫోన్ నెంబరు అన్ని రాజకీయ పార్టీల నాయకుల సెల్‌ఫోన్లలో సేవ్ చెయ్యబడి ఉంటుంది. అన్ని పార్టీల వారికి ఇష్టుడు అవడం, అందరికి కావల్సిన వాడైపోవడంతో వారి సహాయంతో చిన్న, చిన్న సెటిల్ మెంట్స్ చేయించి వారికి కొంత సమర్పించి, తాను కొంత కమీషన్‌గా నొక్కేస్తుంటాడు.

◆ ◆ ◆

అనుకోని రీతిలో ఆ నగరాన్ని తుఫాను అతలాకుతలం చేసింది. నిత్యావసరాలకు గిరాకి ఏర్పడింది. ఇతర రాష్ట్రాల నుండి, పార్టీల నుండి సహాయంగా సరుకులు వెల్లువలా రావడంతో సుబ్బారావు పంటపండింది. అన్ని పార్టీలు అతనికి కావలసినవే కావడంతో తన ఏరియాలో వాటిని పంచుతానని నమ్మబలికి, కొన్నింటిని పంచి, చాలా వరకు తాను బినామి పేర్లతో ఆక్రమించిన కొన్ని బలహీన వర్గాల గృహాలలో దాచేసాడు. ఈ విషయం చాలా మందికి తెలిసినా తెల్లవారితే ఏ పనికైనా అతనితో అవసరం ఉండటంతో ఎవరూ బయట పడటం లేదు. అతని ఆనందానికి అవధులు లేకుండా పోయింది. తన ఇంటి కుటుంబ పోషణకు ఒక సంవత్సరం సరిపోయే సరుకులు కూడగట్టగలిగాడు. హడావుడి తగ్గగానే మిగిలిన సరుకులు మార్కెట్‌కు తరలించేస్తే చేతినిండా డబ్బే...డబ్బు అని తెగ సంబరపడిపోయాడు.

ఆ రోజు రాత్రి అతనికి పక్క రాష్ట్ర నేతల నుండి ఫోన్ వచ్చింది. త్వరలో జరగబోయే ఓ జాతీయ పార్టీ సమావేశానికి ఇక్కడ నుండి మనుషులను సప్లయి చేయవలసి ఉందని, వివరాలు మాట్లాడుకోడానికి అర్జెంటుగా రమ్మని కబురొచ్చింది. భార్యకి, కొడుక్కి చెప్పి 'ఇది చాలా పెద్ద బేరమని రావడానికి లేటయినా కంగారు పడొద్దని' ఆ రాత్రి హడావుడిగా బయలుదేరి వెళ్లిపోయాడు.

◆ ◆ ◆

మర్నాడు మధ్యాహ్నాం "సుబ్బారావు ఇంటి దగ్గర చాలా కోలాహలంగా ఉంది. ఎవరో స్వామీజీ అతనింటికి వచ్చి తన మహిమలతో ఏవేవో సృష్టించి ఇస్తున్నాడని తెలిసి ఆ ఏరియా ప్రజలందరూ అక్కడకు పెద్ద సంఖ్యలో చేరారు. స్వామీజీ ఇస్తున్న లింగాలు, గొలుసులు, విభూతి తీసుకుని ప్రజలు ఆనంద పరవశులు అవుతున్నారు. అదంతా పర్యవేక్షిస్తున్న సుబ్బారావు భార్య 'తన జన్మ ధన్యమయిందని' ఆయనకు హారతులిచ్చి, భజనలు చేయడం మొదలు పెట్టింది. ప్రజలందరూ అక్కడికి వరుసలు కట్టడంతో ఆ ప్రాంతపు ప్రజా ప్రతినిధి కూడా స్వామీజీని దర్శించుకుని సందడి మరింత పెరగడానికి దోహదపడ్డాడు".

ఓ గంటపాటు సాగిన భజన అనంతరం భక్తుల సందేహాలకు సమాధానాలు ప్రారంభించారు స్వామీజీ. ముందుగా సుబ్బారావు కొడుకుకి ఆ అవకాశం ఇచ్చారు.

"స్వామీ! ప్రజలు తుఫాను దాటికి నిత్యావసరాలు తగినంతగా దొరకక సతమత మవుతున్నారు. మీ మహిమలతో వాటిని

"సుబ్బారావు ఇంటి దగ్గర చాలా కోలాహలంగా ఉంది. ఎవరో స్వామిజీ అతనింటికి వచ్చి తన మహిమలతో ఏవేవో సృష్టించి ఇస్తున్నాడని తెలిసి ఆ ఏరియా ప్రజలందరూ అక్కడకు పెద్ద సంఖ్యలో చేరారు. స్వామిజీ ఇస్తున్న లింగాలు, గొలుసులు, విభూతి తీసుకుని ప్రజలు ఆనంద పరవశులు అవుతున్నారు. అదంతా పర్యవేక్షిస్తున్న సుబ్బారావు భార్య 'తన జన్మ ధన్యమయిందని' ఆయనకు హారతులిచ్చి, భజనలు చేయడం మొదలు పెట్టింది. ప్రజలందరూ అక్కడికి వరుసలు కట్టడంతో ఆ ప్రాంతపు ప్రజా ప్రతినిధి కూడా స్వామిజీని దర్శించుకుని సందడి మరింత పెరగడానికి దోహదపడ్డాడు".

తెప్పించి ప్రజలకు పంచవచ్చు కదా?" అని అడిగాడు.

"నాకే పరీక్ష పెడుతున్నావా?" అన్నట్లు తీక్షణంగా చూసారు స్వామీజీ.

"తప్పుగా భావించకండి స్వామీ! ప్రజలకు ఇప్పుడు కావలసినవి అవేగా. అందుకే అడిగాను" అన్నాడు వినయంగా సుబ్బారావు కొడుకు.

"ఏదీ తనంతటతానుగా నీదగ్గరకు రాదు. శోధించి సాధించాలి. అదే మీ కర్తవ్యం" అని ఏదో సిన్మాల్లో పాటను ఉదహరిస్తూ ఒకసారి కళ్లుమూసుకుని రెండు నిమిషాలు ఏదో ధ్యానం చేసి "నాకు మరో భక్తుని ఇంట్లో పూజా కార్యక్రమం ఉంది. వెంటనే నేను బయలు దేరి వెళ్లాలి. నీవు కోరినట్లే ప్రజలకు అవసరం అయ్యే వస్తువులు అందచేస్తాను. నేను చెప్పిన చోటుకి వెళ్లి వాటిని మీ అమ్మగారు ఈ ప్రజాప్రతినిధి కలిసి అర్హులైన వారికి అందచేయండి" అంటూ సుబ్బారావు కొడుకు చెవిలో ఏదో చెప్పి అక్కడ నుండి వెళ్లిపోయాడు స్వామీజీ.

◆ ◆ ◆

ఆశ్చర్యం! ఆ స్వామీజీ చెప్పిన ఇళ్లలో పెద్ద ఎత్తున తుఫాను బాధితులకు పంపిన సరుకులతో నిండి ఉన్నాయి. అవన్నీ సుబ్బారావు బినామీ పేర్లతో ఆక్రమించిన పేదల ఇళ్లే. స్వామీజీ చెప్పినట్లే వాటిని అర్హులందరికీ ప్రజాప్రతినిధి, సుబ్బారావు భార్య, కొడుకు పంపిణీ చేసారు. వారి ఫొటోలు అన్ని పేపర్లలోనూ పడటంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. ఆ రోజు వెళ్లిపోయిన స్వామీజీ మళ్లీ ఎవరికీ ఎక్కడా కనిపించలేదు.

◆ ◆ ◆

నాలుగు రోజుల తర్వాత ఇంటికి చేరుకున్న సుబ్బారావుకి భార్యా, కొడుకు జరిగినవన్నీ చెప్పి, పేపర్లలో పడిన తమ ఫొటోలను చూపించారు. అది చూసి తేలు కుట్టిన దొంగలా మౌనం దాల్చవలసి వచ్చినా, లోపల తెగ బాధపడిపోయాడు పాపం సుబ్బారావు.

నాటకానుభవంతో పాటు, మెజీషియన్‌గా ప్రదర్శనలిచ్చే తన మిత్రుడిని స్వామీజీ రూపంలో రప్పించి తండ్రి అక్రమంగా దాచిన తుఫాను సరుకులు చేరవలసిన వారికే చేర్పించింది తన కొడుకే అని తెలిస్తే ఏమవుతాడో సుబ్బారావు. అందుకే అన్నారేమో 'ఇంటి దొంగని ఈశ్వరుడైనా పట్టుకోలేడని'.

✦

నవ్వుల్ – పువ్వుల్

ఆమెకు పోటీ

రవి : ఆ డప్పుని కొనుక్కుని ఇంటికి వెళుతున్నావేంరా?

రాజు: మా ఆవిడ బూర కొనుక్కుని రాత్రంతా ఊదుతుంది. అందుకే ఆమెకు పోటీగా నేను డప్పును రాత్రంతా వాయిద్దామని!

ఫెయిలైతే...

బన్నీ: గాల్లో ఎగిరే రెండిటి పేర్లు చెప్పరా!

చింటు : ఒకటి విమానం, రెండు నేను..!

బన్నీ : నువ్వా అదేంటి!

చింటు: మరి పరీక్ష ఫెయిల్ అయి వచ్చినప్పుడు మా నాన్న నన్ను గాల్లోకి ఎగరేసి తంతాడుగా

సగం రొట్టె

చిన్ని : రొట్టె చాలా బావుందమ్మాయ్...కాని సగమే పెట్టావు. పూర్తిగా పెట్టుంటే నా ఆకలి తీరేది.

బుజ్జి : ఆ ఊరకుక్క వచ్చి సగమే తినేసింది. లేకుంటే పూర్తిగానే పెట్టేదాన్ని.

కడుపులో చేప

డాక్టర్ : ఏమయ్యా అలా పరిగెత్తుకు వస్తున్నావ్..?

పేషెంట్ : ఇప్పుడే చేపల కూర తిన్నాను డాక్టర్

డాక్టర్ : అయితే ?

పేషెంట్ : కడుపులోకి వెళ్లిన తరువాత చేప ఈదుతున్నట్టుగా డౌటుగా వుందండీ..!

దోసెయ్!

సర్వర్ : సార్ వచ్చారు, దోసెయ్...!

కస్టమర్ : ఆ..ఆ.. మీ ఓనర్ ఎప్పుడూ మా వద్ద దోసేస్తాడు గానీ ఓ ప్లేటు ఇడ్లీ చెప్పు...!

ఎవరండీ ఆయన!

భార్య : ఏవండీ, ఉన్నట్టుండి ఆ వచ్చే అతన్ని చూసి బయటకు పరిగెడుతున్నారు. ఎవరండీ ఆయన !

భర్త : మనకు మొట్ట మొదట అప్పు ఇచ్చిన వ్యక్తి అతనేనే...ఇన్నాళ్లకి మన అడ్రస్ పట్టుకుని వచ్చేసాడు...నీవు కూడా బయటకు పరిగెత్తు...తొందరగా !

ఉపాధి కల్పన

సుందరం : అవసరం లేకపోయినా అందరి దగ్గరా అప్పులెందుకు చేస్తావ్ ?

రమణయ్య : వారందరికీ ఉపాధి కల్పిద్దామని

సుందరం : వారికి ఉపాధి నీవు కల్పించడమేమిటి ?

రమణయ్య : మరి నేను వడ్డీ డబ్బులిస్తేనే కదా, వారు బ్రతికేది.

అదేంటి ?

కస్టమర్ : అర్జెంటుగా ఒక దోసె చెప్పు

సర్వర్ : అర్జెంటు అయితే మీరే వచ్చి పప్పు రుబ్బుకోవాలి

కస్టమర్ : అదేంటి...?

సర్వర్ : కరెంటు లేదు. మిక్సీ, గ్రైండర్ లో రుబ్బటానికి.

'పూజ' కోసం

తండ్రి : ఏవమ్మా, అలా ఒంటరిగా కూర్చుని ఏడుస్తున్నావు అల్లుడు గారు ఎక్కడ ?

కూతురు : ఆయన ఈ మధ్య బాగా మారి పోయారు డాడీ! రోజూ గుడికెళ్లి పోతున్నారు.

తండ్రి : ఎందుకు ?

కూతురు : 'పూజ' కోసమట...ఎవరో మరి ఆ 'పూజ'

- ముత్యాల శ్రీశరత్‌బాబు, ఫోన్ నెం : 9963298921

కవి ప్రేమికులు రామి-చండీదాస్

◆ జానపదం

రమణి ఎక్కడ పుట్టిందో? ఎక్కడ పెరిగిందో ఎవరికీ తెలియదు. బట్టలుతకడం ఆమె కులవృత్తి. ఆ ఊరు, ఈ ఊరు తిరుగుతూ చివరికి ఆమె, బీర్‌భూం జిల్లాలో నసూర్ గ్రామానికి చేరుకుంది. అక్కడ బాషులిదేవి ఆలయం లోపల పనికి కుదురుకుంది. ఇది ఈ నాటి సంగతి కాదు. పదిహేనవ శతాబ్దపు మాట!

ఆ కాలంలో ఆ ఊరు చాలా ప్రసిద్ధి కెక్కింది. ఎందుకంటే అక్కడ ఒక గొప్ప వైష్ణవ కవి చండీదాస్ ఉండేవాడు. భక్తి ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న ఆ రోజుల్లో భక్తి పారవశ్యంలో చండీదాస్ చెప్పే పద్యాలు దూర దూర ప్రాంతాల వారికి చేరుతూ ఉండేవి. ఆ విధంగా రమణి, చండీదాస్ పేరు విన్నది. ఎలాగైనా ఆయన్ను చూడాలని నసూర్ గ్రామం చేరి అక్కడ ఆలయం శుభ్రం చేసే పనికి ఒప్పుకుంది. తను కడిగి శుభ్రం చేసిన బాషులి దేవి ఆలయ ప్రాంగణానికి పూజారి చండీదాస్ కవి వచ్చినప్పుడల్లా ఆయనకు భక్తి శ్రద్ధలతో సపర్యలు చేసేది. చండీదాస్ కవిత్వమంటే ఆమెకు ఎంతో ఇష్టం! ఆయనతో పరిచయం పెరిగిన కొద్దీ ఆయనంటే ఇష్టం పెరగసాగింది. సహజంగా తనకు సాహిత్యం వైపు ఉన్న అభిరుచి వల్ల, చండీదాస్ ప్రభావం వల్ల రమణి కూడా ఆసువుగా కవితలు చెప్పడం ప్రారంభించింది. ఆ రకంగా రమణి తొలితరం బెంగాలీ కవియిత్రి అయ్యింది.

రమణి-చండిదాస్‌ల మధ్య ప్రేమ బలపడింది. ఇద్దరూ కవులు కావడం. అభిరుచులు కలవడంతో అనతి కాలంలోనే ఆత్మీయులు కావడానికి వీలయ్యింది. కాని వారి ప్రేమకు ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి. చండీదాస్ అగ్రకులానికి చెందినవాడు. రమణి నిమ్న జాతికి చెందినది. వారు జీవిత భాగస్వాములు కావడానికి ఆనాటి సమాజం ఎలా ఒప్పుకుంటుంది? భార్యాభర్తలు కాలేక పోయినా వారి ప్రేమను కవితలలో వ్యక్తం చేసుకుంటూ ఉండేవారు. చండీదాస్ పద్య కావ్యాలు ప్రకటిస్తూ ఉంటే, రమణి పదాలల్లుతూ వచ్చింది. చండీదాస్ రమణిని ముద్దుగా పొట్టిపేరుతో 'రామి' అని పిలిచేవాడు.

సమాజం ఆమోదించని వారి ప్రేమ, వారి జీవితంలో మళ్ళీ కోలుకోకుండా చేసింది! చండీదాస్‌ను గ్రామాన్నుండి బహిష్కరించారు. రామిని ఆలయంలో పని మాన్పించారు. ఆ దశలో వీరి ప్రేమకథ మరో మలుపు తిరిగింది. చండీదాస్ ప్రజ్ఞాపాటవాల గురించి విన్న గౌర్-నవాబు అతణ్ణి తన అంత:పురానికి ఆహ్వానించాడు. కవితా గానం చేయమన్నాడు. ఒక కవికి అంతకన్నా ఏం కావాలి? సంతోషంగా వెళ్ళి చండీదాస్ కవితాగానం చేశాడు. అది అతడి ప్రాణం మీదికి వస్తుందని అతడికి తెలియదు. అంత:పురంలో జరిగిన కవితా గానానికి బేగం సాయెబా తదితర పరివారమంతా హాజరయ్యారు.

చండీదాస్ ముగ్ధమోహన రూపానికి బేగం పరవశరాలైంది. ఆ విషయం తన మనసులో దాచుకోగలిగితే బావుండును. కాని అలా జరుగలేదు. చండీదాస్ పట్ల తనకు గల ప్రేమను ఆమె బాహాటంగా వ్యక్తం చేసింది. గౌర్-నవాబు తన భార్యను అదుపులో పెట్టుకోలేక తన కసిని, కోపాన్ని చండీదాస్ మీద వెళ్ళగక్కాడు. అమాయకుడైన చండీదాస్‌ను చిత్ర హింసలకు గురి చేశాడు. తన భార్య కళ్ళెదుటే చండీదాస్‌ను ఏనుగులతో లాగిస్తూ, కొరడా దెబ్బలకు గురి చేశాడు. తన వెంటే విలపిస్తూ వస్తున్న తన ప్రేయసి 'రామి' పై దృష్టి నిలిపి - చండీదాస్ అలాంటి చిత్రహింసలు భరించాల్సి వస్తొందని బేగం గ్రహించి, తన మనసు మార్చుకుంటుందని నవాబుగారి ఆశ! కానీ, ఆయన ఊహించిన దానికి భిన్నంగా జరిగింది. సున్నిత మనస్కురాలైన బేగం, తన ప్రేమను ఆపుకోనూలేక చండీదాస్ చిత్రహింసల్ని చూసి భరించనూ లేక, మానసికంగా ఎంతో వేదనకు గురై ఆత్మహత్య చేసుకుంది.

తన వాడైన చండీదాస్‌ను ప్రేమించి, పరోక్షంగా అతణ్ణి చిత్ర హింసలకు గురిచేసిన బేగం సాహెబా అంటే రామికి విపరీతమైన కోపం, పగ, ద్వేషం, అసహ్యం అన్నీ- కానీ బేగం తన ప్రేమ ఔన్నత్యాన్ని తెలుపుకోవడం కోసం ఆత్మహత్య చేసుకోగానే రామిలో

పరివర్తన కలుగుతుంది. తనలోని కోపాన్ని ద్వేషాన్ని పక్కకు నెట్టి శవం కాళ్ళమీద పడి భోరున విలపిస్తుంది! తన ప్రేమికుడు చండీదాస్ తనకు ఇచ్చిన మాట నిలుపుకోలేదని కూడా బాధ పడుతుంది. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో చండీదాస్ రామికి ఒక వాగ్దానం చేస్తాడు. 'తన జీవితంలో ఎప్పుడూ ధనికులను ఆశ్రయించనని, అంత:పురాల్లోకి వెళ్ళనని'! తన ప్రేమని అంగీకరించని సమాజాన్ని తాము మాత్రం ఎందుకు అంగీకరించాలి? అన్నది రామి వాదన. ఆ వాదనతో ఏకీభవించిన చండీదాస్, వారికి మాటిచ్చాడు. కాని ఏ కారణం వల్లనో ఇచ్చిన మాట తప్పి, ఎన్నో రకాలుగా బాధలను అనుభవించాడు. ఏది ఏమైనా, రామి పట్ల తనకు గల ప్రేమను ఏ మాత్రం సడలిపోనీయలేదు.

రామి–చండీదాస్‌లది ఎంతో ఉదాత్తమైన ప్రేమ. ఉన్నతమైన ప్రేమ. ఆకర్షణలన్నింటికీ అతీతమైన అలౌకిక ప్రేమ. ఆధ్యాత్మిక ప్రేమ. విషాదభరితమైన వారి ప్రేమ కథను ఎవరూ గ్రంథస్థం చేయలేదు. కాల గర్భంలో కలిసిపోయింది. కాని కొన్ని శతాబ్దాల తర్వాత అది మళ్ళీ వెలుగు చూస్తుందని ఎవరూ ఊహించలేదు.

చండీదాస్ మధ్య యుగాల నాటి బెంగాల్ కవి. 1408 ప్రాంతంలో పుట్టి ఉంటాడని, రాధా కృష్ణుల ప్రేమ గురించి 1250 గీతాలు రాశాడని పరిశోధకులు ప్రకటించారు. ఆ తర్వాత అవి కృష్ణా కీర్తనలు (వైష్ణవ కీర్తనలు)గా ప్రసిద్ధికెక్కాయి. కృష్ణభక్తుడైన చైతన్యుడికి చండీదాస్ కీర్తనలంటే ఎంతో ఇష్టం! రచనలన్నీ పరిశీలించిన తర్వాత చండీదాస్‌లు ముగ్గురున్నారని వారి పేర్ల చివర 'బదు' 'ద్విజ' 'దీన'అని ఉందని పరిశోధకులు వారి పేర్ల చివర 'బదు' 'దిగు' అని ఉందని పరిశోధకులు తేల్చారు. ఏది ఏమైనా రామిప్రేమికుడు చండీదాస్‌కి ఆ ఇతర చండీదాస్‌లకు ఏ మాత్రం సంబంధం లేదని వారు గుర్తించారు. 1408 ప్రాంతంలో పుట్టి ఉంటాడని, రాధా కృష్ణుల ప్రేమ గురించి 1250 గీతాలు రాశాడని పరిశోధకులు ప్రకటించారు. ఆ తర్వాత అవి కృష్ణ కీర్తనలు (వైష్ణవ కీర్తనలు)గా ప్రసిద్ధికెక్కాయి. క్రీ.శ. 1440 ప్రాంతంలో జీవించిన రామి– చండీదాస్‌ల కథ పరిశోధకుల ప్రయత్నాల వల్ల 1750 ప్రాంతంలో బయటపడింది. వైష్ణవ కవి చండీదాస్ కృతులు పరిశోధకులకు లభించినప్పుడు, వారు వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్న దశలో ఒక అద్భుతం జరిగింది. కృష్ణప్రేమకు సంబంధించిన ఆ కృతులలో కొన్ని కృతులు భిన్నంగా కనిపించాయి. వాటిని మరింత నిశితంగా పరిశీలిస్తే, వాటిలో చండీదాస్ ఆత్మకథ బయట పడింది. పైగా బలాన్ని చేకూర్చే మరో రుజువు ఏమంటే... బెంగాల్ జానపద గాథల్లో ప్రముఖంగా వినిపించే ఒక గాథ, పరిశోధకులకు లభించిన ఈ చండీదాస్ ఆత్మకథ ఒక్కటే! అంటే రామి – చండీ దాస్‌ల ప్రేమకథ జానపద గీతంగా మరి జనం నాలుకల మీద ఉండిపోయింది. రామి (రమణి) అలవోకగా అల్లిన పదాలు అప్పటికే జానపద గీతాల్లో కలిసి పోయాయి. వందల యేళ్ళు గడిచినా బెంగాల్ జనజీవితంలో అవి సజీవంగా నిలిచిపోయాయి. చండీదాస్ రచనలు గ్రంథస్థమై నిలిస్తే, రామి రచనలు జనం నాలుకల మీద నిలిచాయి. స్థల కాలాదుల్ని ఇతర సంఘటనల్ని బాగా అధ్యయనం చేసి చూస్తే – వీరిరువురే కథానాయికా నాయకులని, వీరి ప్రేమ కథ కాలానికి ఎదురీది నిలిచిందని పరిశోధకులకు అర్థమైంది. ఆ విధంగా కవి ప్రేమికులైన 'రామి– చండీదాస్'ల కథ నిష్కల్మమైన ప్రేమను నిర్వచించింది. నాటి జానపద గీతాల్లో జీవం పోసుకుంది.

- డాక్టర్ దేవరాజు మహారాజు

ఇంటర్‌నేషనల్ కాల్స్ ఉచితంగా...

విదేశాల్లో ఉన్న మీ బంధుమిత్రులతో ఫోన్‌లో మాట్లాడాలంటే...ఇంకేమైనా ఉందా? బిల్లు వాచిపోదూ! డబ్బు గురించి ఆలోచిస్తే ... ఆత్మీయులతో మాటలకు కూడా దూరమౌతాం! అయితే ఉచితంగా మాట్లాడే అవకాశం ఉంటే ఎంత బాగుంటుందోకదా?! అలా అనుకోని వారుండరేమో! పైసా ఖర్చు లేకుండా, ఇంటర్నేషనల్ కాల్ టారిఫ్‌తో సంబంధం లేకుండా ఇతర దేశాల్లో ఉన్న వారితో ఫోన్‌లో ఉచితంగా మాట్లాడటానికి ఇప్పుడు చాలానే మార్గాలున్నాయి. అవేంటో చూద్దాం!

నంబర్ ట్యాంక్

ఈ నంబర్ ట్యాంక్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి అకౌంట్ లాగిన్ అయితే సరిపోతుంది. ఐఎస్‌డి కాల్స్ మాట్లాడుకోవచ్చు. పైసా ఖర్చు లేకుండానే నంబర్ ట్యాంక్ వెబ్‌సైట్‌లో ఖాతా తెరవచ్చు. ఇందులో అకౌంట్ ఉన్నవారు రోజుకు 30 నిమిషాల పాటు ఉచిత వాయిస్ కాల్స్ మాట్లాడుకోవచ్చు.

గూగుల్ వాయిస్

గూగుల్ అందిస్తోన్న అత్యుత్తమ సర్వీసుల్లో గూగుల్ వాయిస్ ఒకటి. ఇది కంప్యూటర్, ల్యాప్‌టాప్ నుండి ఉచితంగా ఇంటర్నేషనల్ కాల్స్ మొబైల్ ఫోన్లకు చేసుకోవచ్చు. అయితే చిన్న కండిషన్. ప్రస్తుతానికి ఈ అవకాశం కేవలం అమెరికాలో మాత్రమే అందుబాటులో ఉంది. మిగిలిన దేశాల్లో అయితే కాల్‌రేట్ టారిఫ్ ఆధారంగానే గూగుల్ వాయిస్ ఇంటర్నెట్ కాల్ రేటుకు అనుగుణంగానే ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

ఐకాల్

ఈ ఐకాల్ అనే వెబ్‌సైట్ ద్వారా కంప్యూటర్, ల్యాప్‌టాప్ నుండి ఇంటర్నేషనల్ మొబైల్ కాల్స్ మాట్లాడుకోవచ్చు. ఇండియా నుండి అమెరికా, కెనడాలకు ఉచితంగా కాల్స్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఐకాల్ యాప్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్లు వాడేవారికి కూడా అందుబాటులో ఉంటుంది. ఐదు నిమిషాల వ్యవధితో రోజుకు ఎన్ని సార్లు అయినా కాల్స్ చేసుకోవచ్చు.

కాల్ టు ఫ్రెండ్

ఇదీ ఒక వెబ్‌సైటే. ఈ వెబ్‌సైట్ ద్వారా ఒక నిమిషం కాల్ డ్యూరేషన్‌తో ఏ దేశానికైనా కాల్స్ చేసుకోవచ్చు. ఎన్ని కాల్స్ అయినా చేసుకోవచ్చు. ఇదే కాక గల్ఫ్ స్లిప్ అనే వెబ్ సైట్ నుండి కూడా మొబైల్స్‌కు, కంప్యూటర్ నుండి పీసీకు ఉచితంగా విదేశాల్లో ఉన్న బంధుమిత్రులతో మాట్లాడు కోవచ్చు. ✦

ఓ మైగాడ్..
ఫక్తు పురాణం గోపాలా!

◆ సినిమా కబుర్లు

అమీర్ ఖాన్ 'పికె' చిత్రంపై అలజడి రాజకీయంగానూ సంచలనం కలిగించింది. ఇటీవల మెసెంజర్ ఆఫ్ గాడ్ (ఎమ్ఓజి) విడుదల వివాదంలో మొత్తం సెన్సార్ బోర్డునే తప్పించిన తర్వాత ఈ చర్చ ఇంకా ముదిరింది. అయితే 'పికె' కన్నా ముందే విడుదలైన 'ఓ మై గాడ్' (ఓఎంజి) చిత్రం పేరు కూడా ఈ క్రమంలో ప్రస్తావనకు వచ్చింది. ఏమంటే 'ఓఎంజి' చిత్రమే 'పికె'కు ప్రేరణ అన్న కథనాలు బాగా వినిపించాయి. ఇప్పుడు 'ఓఎంజి' తెలుగులో 'గోపాల గోపాల' పేరిట పవన్ కళ్యాణ్, వెంకటేష్ తదితర అగ్రనటుల కాంబినేషన్‌లో విడుదలైన తర్వాత ఈ విషయమై ఆసక్తి ఇంకా పెరిగింది.

సినీ వర్గాల కథనం ప్రకారం అమీర్ ఖాన్ 'పికె' చిత్రం తయారవుతుండగానే 'ఓఎంజి' విడుదలైంది. దాన్ని చూసి ఆ చిత్ర దర్శకులు హతాశులైనారు. ఎందుకంటే తాము తీస్తున్న తరహా సన్నివేశాలే అందులో వున్నాయి. అయితే అమీర్ ఖాన్ వారిని ప్రశాంతపర్చాడట. కావలసినంత సమయం తీసుకుని కథలో కొత్త ట్విస్టులు పెట్టి పూర్తి చేయండని చెప్పాడు. అందుకే అయిదేళ్ల నిర్మాణ సమయం అవసరమైంది. ఓమైగాడ్ విడుదల తర్వాత రెండేళ్లకు 'పికె' వచ్చింది. ఈ రెండు చిత్రాల్లోనూ కపట సన్యాసుల గురించిన విమర్శలు, దేవుడిని ప్రశ్నించే సన్నివేశాలు చూసి చాలా మంది ఒకటే విధంగా వున్నాయని భావించారు. స్వాములను దేవుడి దూతలుగా పరిగణించి నష్ట పరిహారం కోరడం ఒకటే ఉమ్మడి అంశం. అది మినహాయిస్తే ఈ రెండు చిత్రాలకూ



హస్తిమశకాంతరం తేడా వుంది.

'పికె'లో కథానాయకుడు అన్యగ్రహం నుంచి వచ్చిన వ్యక్తి. అతనికి ఇక్కడి మత భేదాలు, పూజా పురస్కారాలు సాధువులు స్వాములూ అన్నీ విచిత్రాలే. తను తిరిగి వెళ్లడానికి అవసరమైన పరికరం ఒక స్వామీజి సంగ్రహించాడని తెలిసి దానికోసం అతను పోరాడతాడు. దొరగ్గానే వెళ్లిపోతాడు. ఈలోగా హాస్య ధోరణిలో సమాజంలోని వైరుధ్యాలనూ విచిత్రాలనూ దర్శకుడు చూపిస్తాడు. ముఖ్యంగా దేవుడి పేరిట జరిగే అనేక దగాకోరు వ్యవహారాలను దొంగ స్వాములను ఎండగడతాడు. దేవుడున్నాడా లేదా అనే చర్చ గాని ఆస్తిక నాస్తిక సంవాదం గాని ఈ చిత్రంలో ఎక్కడా వుండవు. ఈ కారణం వల్లనే సంఘ పరివార్ ఈ చిత్రంపై దాడి చేసింది. పైగా భారత పాకిస్తాన్‌ల హిందూ ముస్లింల ప్రస్తావనలు కూడా వుంటాయి. క్రైస్తవుల జ్ఞానస్నానాన్ని, మహమ్మదీయులకు సంబంధించిన అంశాలను కూడా ఈ చిత్రం



ప్రశ్నిస్తుంది. అయితే అందంగా హాస్యభరితంగా సున్నిత స్పర్శతో గిలిగింతలు పెట్టేట్టు నడుస్తుంది.

ఇప్పుడు 'గోపాల గోపాల' విషయానికి వస్తే ఇందులో దేవుడు వున్నాడని నిరూపించడం ప్రధానాంశం. అందుకోసం దేవుడే దిగిరావడం మాత్రమే కాదు, పౌరాణికాలను మించిపోయేలా విశ్వరూపం కూడా చూపిస్తాడు. అడుగడుగునా అగుపించిన మహిమలు ప్రదర్శిస్తాడు. 'కృష్ణున్ని గనక మాయలు చేశాను. మాయలు చేశాను గనక కృష్ణున్ని కాలేదు' అని చివరలో వివరణ కూడా ఇస్తాడు. చిత్రంలో ఇతర స్వాములు చిన్న చిన్న విగ్రహాలు తీయడం వంటివి చేతి వాటం మాత్రమేననీ, నిజమైన దేవుడు అఖిలాండ బ్రహ్మాండాలను సృష్టించగలడనీ సందేశం వుంటుంది. ఇది చెప్పడం కోసం మరో నాయకుడైన వెంకటేష్ (గోపాలరావు) పాత్రను మొదట నాస్తికుడిగా చూపిస్తారు. అయితే అతను ఆస్తికుల నమ్మకాలను సొమ్ము చేసుకోవడానికి వెనకాడబోడని, అందుకోసం మహిమలు వున్నాయని తానే చెబుతాడనీ చూపించారు. నిజంగా భక్తి విశ్వాసాలు లేనివాడైతే ఇలా చేయడం మోసం. ఒక విధంగా దర్శకుడు ఆ పాత్రను కావాలనే తక్కువ స్థాయిలో చిత్రించాడు. చివరకు అతని కళ్లు తెరిపించేందుకు దేవుడే దిగివచ్చి భగవద్గీత ఇస్తాడు. దాన్ని చదివిన తర్వాత అతని ధోరణి మారిపోతుంది. ప్రాణం కాపాడి విశ్వరూపం చూపించి వెళ్లిపోతాడు. దీంతోపాటు కపట స్వాములను ఎంత హీనంగా చూపించినా నిజమైన స్వాములు వేరే వున్నారని చెప్పేందుకు ప్రత్యేకంగా కొన్ని పాత్రలు సృష్టించారు. వారు కూడా గోపాలరావుతో పాటు కపట స్వాములను ఎదుర్కొంటారు. కనక గోపాల గోపాల సందేశం కొందరు అనుకుంటున్నట్టు హేతువాదం ఎంత మాత్రం కాదు. అసలు సిసలు భక్తి ప్రబోధం.ఆ పని సూటిగా చేస్తే ఏ సమస్య వుండేది కాదు. పికె నేపథ్యంలో దీనికి కొత్త కోణం జతపడితే ప్రచారానికి బాగా ఉపయోగించుకోవడం వల్లనే గజిబిజి. అందుకు ఒకింత లోతైన విశ్లేషణ అవసరం.

ఇంకా విడుదల కాని ఎంఓజి ఎలా వుంటుందో తెలియదు గాని అక్కడ సాక్షాత్తూ ఒక కపట స్వామి హీరోగా నటించి దేవుడి దూతనని ప్రకటించుకుంటున్నాడు. ఏతావాతా 'పికె'లో ఇచ్చిన సందేశానికి పూర్తి తలకిందుల వ్యవహారమన్నమాట. స్వాములు ఇప్పటి వరకూ వ్యాపారాలు రాజకీయాలకు పరిమితమైతే ఈ చిత్రంలో సినీ రంగంలోనూ బలంగా కాలూనడం ఆసక్తికరం. ఇదే విధంగా ఒకో ఆశ్రమం ఒకో హీరోను వదిలితే ఏమవుతుందో.. 'గోపాల గోపాల'!

- తె.ర

'స్మార్ట్' బిచ్చగాడు!

స్మార్ట్ అంటే అందగాడనుకుంటే పొరపాటే. అయినా అందాన్ని ఎంచడానికి మనమెవరం?! ఎవరి అందం వారిది?! ఎవరి సౌందర్య దృష్టి వారిది! పాయింటుకొచ్చేస్తే... ఇతడి పేరు డామెయిన్ ప్రెస్టాన్ బూత్. వయసు ముప్పై ఏడేళ్లు. నివాస ప్రాంతం లండన్. వృత్తి యాచన. ఈ విషయంలో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానాన్ని ఫుల్లుగా వాడేసుకుంటాడు. పేరు ప్రఖ్యాతులున్న వారు, ధనవంతులు అతని టార్గెట్. హోటళ్లు, రెస్టారెంట్లు, నాలుగు రోడ్ల కూడళ్ల దగ్గర అలాంటివారు కనిపిస్తే చాలు. బడాబాబులతో స్నేహంగా పలకరించడానికి చొరవ చూపిస్తాడు. పొరబాటున అక్కడ మీడియా వాళ్లుంటే అడిగి మరీ ఫొటోలు దిగుతాడు. పనిలో పనిగా అప్పుడే తనకు నిలువ నీడ లేదనీ, తినడానికి తిండి లేదనీ జాలికబుర్లు చెప్పేసి సాయం చెయ్యమంటాడు. అప్పుడైతే కాదనలేరని అతని అవిడియా. పొరబాటున డబ్బుల్లేవని, కార్డు మాత్రమే వుందని అన్నారో! అయిపోయారే! మనోడు జేబులోంచి వెంటనే కార్డు రీడర్ బయటికి తీస్తాడు. భిక్షగాడి దగ్గర ఇంత పగడ్బందీ వ్యవహారం వుంటుందని ఎవ్వరూ అనుకోరు కదా. అదన్నమాట. ఇక చచ్చినట్టు గీకాల్సిందే. డాలర్లు ఇవ్వాల్సిందే. నిజానికి ఇతను ప్రిస్టన్‌లో నెలకు 300 పౌండ్లు చెల్లించి మరీ అపార్ట్‌మెంట్ అద్దెకు తీసుకున్నాడు. రోజూ అక్కడి నుంచే లండన్ వెళ్తాడు భిక్షమెత్తుకోడానికి. మరో తమాషా ఏమంటే... ఇతగాడు ఏడాదికి ఐదారు సార్లు విదేశీ యాత్రలు చేస్తాడు. పారిస్, ఇబిజా వంటి చోట్ల దిగిన ఫొటోలు కూడా తన ఫేస్‌బుక్‌లో పెట్టేశాడు. అరబిక్, చైనీస్ వంటి అనేక భాషలు కూడా కొద్ది కొద్దిగా మాట్లాడగలడు. దాంతో విదేశీయుల దగ్గర కూడా ఎలాంటి భాషా సమస్య లేకుండా చెయ్యి చాచి అడుక్కుంటాడట.

ఉప్పు హోటల్

ఐస్ హోటల్...ఇసుక హోటల్...గురించి వినివుంటారు. ఇప్పుడిక ఉప్పు హోటల్ వంతు వచ్చింది. ఇది ఇరాన్‌లో వుంది. గోడలు, బల్లలు, కుర్చీలు... అన్నీ ఉప్పుతో చేసినవే. ఇంతకీ ఈ ఉపాయం ఎవరికొచ్చిందనుకుంటున్నారు. ఇంతియాజ్ డిజైనింగ్ గ్రూపు వారికి. షిరాజ్‌లోని ఉప్పు రాళ్లు, ఉప్పు సరస్సు నుంచి తెచ్చిన నీళ్లు, సహజసిద్ధమైన బంకతో ఈ హోటల్‌ను నిర్మించారట. 'ఉప్పు హోటలా?! అదెట్టుంటుంది?!' అన్న కుతూహలంతో వచ్చేవాళ్ల సంఖ్య కూడా భారీగానే వుందట. వ్యాపారం చేసేవాడికి కావాల్సింది కూడా అదే కదా. ఏదోలా ప్రచారం వుండాలి. వ్యాపారం సాగాలి. అంతే. అది నెరవేరుతోంది కాబట్టి ... ఆల్ హ్యాపీస్.

అందంగా వుంటే బిల్లు కట్టక్కర్లా

హోటల్ ఏదైనా...తిన్న దానికి బిల్లు కట్టాల్సిందే. అయితే చైనాలో ఓ రెస్టారెంట్లో మాత్రం బిల్లు కట్టక్కర్లా. ఇది అందరికీ కాదులెండి. సుందరాంగులు, సుందరులకు మాత్రమే. చైనాలో ఎక్కడ ఏ ప్రావిన్స్‌లో... ఏ రెస్టారెంట్లో...? అనుకుంటున్నారేమో! జెంజుహూ నగరంలో ఓ కొరియా రెస్టారెంట్ వుంది. అక్కడ! ఆ మధ్య 'అందంగా వున్న వారు బిల్లు కట్టనక్కర్లా!' అని ఒక బోర్డు పెట్టారు బహిరంగంగా. ఇక చూస్కోండి జనం తెగ ఎగబడ్డారు. మరి ప్రతి ఒక్కళ్లకీ తమకు తాము అందంగానే కనిపిస్తారు కదా. అయితే అక్కడికెళ్లాక తెల్సింది. స్థానిక ప్లాస్టిక్ సర్జన్ల బృందం ఒకటి అందగాళ్లను అందగత్తెలను ఎంపిక చేస్తుందని. వారు కస్టమర్ల మొహాలు, ముక్కు, మూతి, నోరు... బాగా పరిశీలించి అందానికి మార్కులు కూడా వేశారు. ఆ బోర్డుని సైతం బయట బహిరంగంగానే పెట్టేశారు. దాంతో మిశ్రమ స్పందన వచ్చింది. "అంటే అందంగా లేనివాళ్లు రెండింతల బిల్లు కట్టాలా?!' అన్న విమర్శలు కూడా వచ్చాయట. పైగా ఈ బోర్డు స్థానిక అధికారుల అనుమతి లేకుండా పెట్టేశారు. చివరికి ఆ నోటా ఆ నోటా అధికారులకు తెలిసి హుటాహుటిన వచ్చి బోర్డు పీకి పారేయించడంతో వివాదం సద్దు మణిగింది.

మనకూ ఉంది ఓ కాశ్మీర్...!

మంచుతెరల అందాలు, శీతల పవనపు పరవశాలు అనుభవంలోకి రావాలంటే- మనం ఏ కాశ్మీరో వెళ్లక్కర్లేదు. తేలియాడే తెల్లమబ్బులు, తాకిపోయే తుషారాలతో కనువిందు చేయాలంటే- ఊటీనో, కొడైకెనాలో తరలిపోనక్కర్లేదు. మన రాష్ట్రంలోనే విశాఖ జిల్లా లంబసింగిని సందర్శిస్తే .. అలాంటి అనుభూతి పొందవచ్చు. మనసునిండా చల్లని జ్ఞాపకాలూ, కళ్లనిండా కమ్మని ప్రకృతి దశ్యాలూ నింపుకొని రావొచ్చు.

లంబసింగి... ఓ చిన్న గిరిజన పల్లె. సముద్రమట్టానికి 3600 అడుగుల ఎత్తులో ఉంది. అందుకే అంత చల్లదనం. చుట్టూ పచ్చదనం అల్లుకొని ఉన్న ఆ పల్లె నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళ్లే దారిలో ఉంది. సహజసిద్ధంగా ఎదిగిన చెట్లు, కనువిందుగా ఒదిగిన లోయలూ, పర్వతాలూ ఆ ఊరిని ఒక అందమైన వర్ణచిత్రంగా చూపిస్తాయి. పర్యాటకులకూ, ప్రకృతి ప్రేమికులకు ఒక మనోహరమైన ప్రపంచం అది.

శీతాకాలం వచ్చిందంటే- వార్తల్లోకి ఎక్కుతుంది లంబసింగి. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా అక్కడ సున్నా డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుంది. ఈ ఏడాది ఇప్పటికే నాలుగుసార్లు గడ్డ కట్టుకుపోయే చలి అక్కడ రికార్డయింది. ఉష్ణోగ్రత బాగా పడిపోయిన శీతల వేళ అక్కడ ప్రకృతి కొత్త అందాలను సంతరించుకుంటుంది. వాతావరణం సరికొత్త రూపం దాల్చుతుంది. సూర్యోదయం జరిగినా ఇక్కడ తెల్లారిందో లేదో తెలియదు. ఉదయం 11 గంటలైనా సూర్య కిరణాలు ఆ పల్లెను సోకవు. మంచుతెరలు తెల్లని దుప్పట్లా కప్పి ఉంటాయి. నాలుగైదు అడుగుల దూరంలో ఉన్న మనిషి కూడా కనిపించడు. మేఘాల్లో ఉన్నట్టు ఉంటుంది. ఎదర ఒక వాహనం వస్తుందని తెలియాలంటే- లైట్లు వేసి ఉండాల్సిందే! మాటమాటకీ హార్న్ కొట్టాల్సిందే! ఇక చలిపులి వీరవిహారం చేస్తూ ఉంటుంది. చలిమంటలు వేసుకొని కాగుతూ ఉంటే తప్ప – దానిని తరిమికొట్టటం సాధ్యం కాదు. స్వెటర్లూ, రగ్గులూ, మంకీక్యాపులూ రోజంతా ధరించి ఉండాల్సిందే! ప్రతి ఏడాదీ నవంబరు నుంచి ఫిబ్రవరి వరకూ ఇలాంటి వాతావరణం నెలకొని ఉంటుంది.

ఎందుకింత చల్లదనం?

లంబసింగి సముద్రమట్టానికి 3600 అడుగుల ఎత్తులో ఉంది. చట్టూ తూర్పు కనుమలు విస్తరించి ఉన్నాయి. లక్షలాది చెట్ల కారణంగా స్వచ్ఛమైన గాలి ఆవరించి ఉంటుంది. కార్బన్‌డయాక్సైడ్ అత్యల్పంగా ఉంటుంది. భూఉపరితలం నుంచి పైకి వెళ్లేకొద్దీ సహజంగానే ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. ఈ కారణాలన్నిటివల్లా లంబసింగిలో ఎప్పుడూ చల్లదనం ఆవరించి ఉంటుంది. దాదాపు 5 కిలోమీటర్ల పరిధిలో ఈ వాతావరణం ఉంటుంది. ఇతర ప్రదేశాల కన్నా దాదాపు 10 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రత ఇక్కడ నమోదవుతోంది. శీతాకాలంలో సున్నా డిగ్రీల ఉష్ణోగ్రత అధికారికంగా తొలుత 2010లో నమోదైంది. వేసవికాలంలో ఇది చక్కని, చల్లని విడిది. మండువేసవి తాండవించే ఏప్రిల్, మే నెలల్లో కూడా ఇక్కడ రాత్రివేళల్లో చలేస్తుంది.

ప్రకృతి అందాల పూలగుత్తి

ఎముకలు కొరికే చలిలో లంబసింగి సందర్శన వింతగా ఉంటుంది. సరికొత్త అనుభూతిని కలిగిస్తుంది. తీవ్రమైన చలి, దట్టమైన మంచు అసౌకర్యం కలిగించే వేళ .... ప్రకృతి మాత్రం కనువిందు చేస్తూ ఉంటుంది. సూర్యుడు నడినెత్తికొచ్చాకే – వెలుగు రేఖలు నేలను తాకుతాయి. ఎత్తయిన చెట్ల మధ్యలోంచి .. మంచుతెరలను చీల్చుకుంటూ ప్రసరించే భానుడి కిరణాలు మనోహరంగా ఉంటాయి. రాత్రంతా స్నానమాడిన ప్రకృతికాంత చెంపలపై మంచుముత్యాలు తళతళా మెరుస్తుంటాయి. లేలేత ఆకుల చివర్లోంచి నెమ్మది నెమ్మదిగా జాలువారే నీటిబిందువులు తేనియ తునకల్లా అనిపిస్తాయి. అలాంటి మనోహర దృశ్యాల నేపథ్యంలో...అడవిపుత్రులు, వనకన్యలూ దైనందిన పనుల్లో నిమగ్నం కావడం అద్భుతంగా అనిపిస్తుంది. నెత్తిన నీళ్లబిందె, ముఖం నిండా దుప్పటి ముసుగుతో మహిళలు తరలిపోతూ ఉంటారు. ఇంకా దూరంగా కట్టెల కావిడి మోసుకొస్తూ గిరిజనులు కనిపిస్తూ ఉంటారు. తెల్లని మంచుతెరల మధ్యలో ఆ దృశ్యాలన్నీ చక్కని ఛాయాచిత్రాల్లా కనిపిస్తాయి. ఇలాటి వాటిని కెమెరాల్లోనూ, మనసు పొరల్లోనూ బంధించే ప్రకృతి ప్రేమికులకు గొప్ప అవకాశమే ఇది!

పెరిగిన పర్యాటక తాకిడి!

నాలుగైదేళ్ల నుంచి లంబసింగికి ప్రాచుర్యం పెరిగింది. దీంతో, పర్యాటకుల సందడి మొదలైంది. మొదట్లో దారకొండ, సీలేరు, భద్రాచలం వెళ్లే పర్యాటకులు నర్సీపట్నం నుంచి చింతపల్లి వెళ్లే ఘాట్ రోడ్డు ఎక్కగానే మార్గమధ్యలో ఉన్న లంబసింగి వద్ద కాసేపు ఆగి వెళ్లేవారు. అత్యల్ప ఉష్ణోగ్రతలు, నిత్యం కురిసే మంచు కారణంగా తక్కువ కాలంలోనే గుర్తింపు వచ్చింది. ఇప్పుడు రాష్ట్రం నలుమూలల నుంచి అరకువ్యాలీ వెళ్లే పర్యాటకులు ముందుగా ఇక్కడకు చేరుకొని... ఇక్కడ నుంచి అరకువ్యాలీకి పయనమవుతున్నారు. ముందుగా అరకువ్యాలీ వెళ్లి లంబసింగి వస్తే ఇక్కడ తగిన వసతులు లేవు. దట్టంగా కమ్ముకునే మంచు, ఉదయం 11 గంటలైనా కనిపించని సూర్యుడు, చెట్ల ఆకుల నుంచి వర్షపు చినుకుల్లా రాలే మంచుబిందువులు, సూర్య కాంతిలో మేఘాల్లా పయనించే మంచు వంటి అందాలను తనివితీరా ఆస్వాదించేందుకు పర్యాటకులు ఒక రాత్రి అయినా ఇక్కడ బస చేయాలని ఆశిస్తారు. కాని అందుకు తగ్గ కనీస వసతులు ఏమీ లేవు. దీంతో పర్యాటకులు నిరాశకు గురవుతున్నారు. కార్లు, జీపుల్లో వచ్చే వాళ్లు వారి వాహనాల్లోనే సేద తీరాల్సి ఉంటుంది. చిన్నపాటి హొటళ్లు కూడా ఇక్కడ లేవు. బస, ఇతర వసతుల కోసం నర్సీపట్నం లేదా చింతపల్లి వెళ్లాల్సిందే! లమ్మసింగి వెళ్లాలి అంటే- రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి విశాఖ జిల్లా నర్సీపట్నం మీద నుంచి. రెండోది ఖమ్మం జిల్లా భద్రాచలం మీదుగా.. పర్యాటకుల స్వస్థలం, వెసులుబాటును బట్టి దారి ఎంచుకోవొచ్చు.

ప్రయివేటు వ్యక్తుల కన్ను

లంబసింగి ప్రాంతం పర్యాటకపరంగా ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తుండటంతో ఇక్కడ అరకులోయ తరహాలో రిసార్టులు, హోటళ్లు నిర్మించాలని, కొందరు ప్రయివేటు వ్యక్తులు భావిస్తున్నారు. 1/70 చట్టం ప్రకారం మన్యంలో ప్రయివేటు వ్యక్తులు శాశ్వత నిర్మాణం చేపట్టే వీలు లేదు. దీంతో, స్థానిక గిరిజనుల భూములను లీజుకు తీసుకొని హోటళ్లు నిర్మించాలని పలువురు వ్యాపారులు భావిస్తున్నారు. భూ యజమానులతో ప్రయివేటు వ్యక్తులు చర్చలు జరుపుతున్నారు. ప్రభుత్వమే ఈ పనిచేసి గిరిజనులకు తగిన భద్రత, ఉపాధి కల్పించటం అవసరం. ప్రభుత్వం కొన్ని ఆలోచనలు చేసింది. ఇది కార్యరూపం దాల్చితే లంబసింగి రూపురేఖలు మారిపోతాయి. పర్యాటక అధికారుల బృందం 2013లో లంబసింగి ప్రాంతాన్ని సందర్శించింది. పర్యాటకుల, స్థానికుల అభిప్రాయాలు సేకరించింది. ఇక్కడున్న వనరులు, కల్పించాల్సిన వసతులు వంటి విషయాలపై నివేదిక రూపొందించింది. పర్యాటకుల సౌకర్యార్థం రూ.5 కోట్లతో రిసార్ట్స్ నిర్మించాలని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ (ఎపిటిడిసి) భావిస్తోంది. దీనికోసం 3.50 ఎకరాలు భూమిని సేకరించే ప్రయత్నంలో ఉంది.

బాక్సైట్ ప్రమాదం

విశాఖ గిరిజనుల గుండెల్లో గుబులు రేపుతున్న బాక్సైట్ తవ్వకాల యోచన లంబసింగి అందాలకు కూడా ప్రమాదమే! ఏజెన్సీలోని బాక్సైట్ నిక్షేపాలను తవ్వి తరలించాలనేది ప్రభుత్వ ఆలోచన. అదే జరిగితే లంబసింగి ప్రాంతం కూడా విధ్వంసానికి గురవుతుంది. కొండలు మాయమైపోతాయి. ప్రకృతిసిద్ధంగా పరచుకున్న ప్రత్యేకతలన్నీ అంతరించిపోతాయి. కాబట్టి- ప్రకృతిని ఫణంగా పెట్టే బాక్సైట్ తవ్వకాలు చేపట్టవద్దని పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ముక్తకంఠంతో కోరుతున్నారు. లంబసింగిలో నెలకొని ఉన్న వాతావరణం అనేక ప్రత్యేక పంటలకు అనుకూలం. ఇప్పటికే కాఫీ, మిరియాలు వంటి వాణిజ్య పంటలు పండిస్తున్నారు. శీతల ప్రాంతాలకు పరిమితమయ్యే యాపిల్ సాగు ఇక్కడ చేపట్టేందుకు శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు. అవి మంచి ఫలితాలను ఇచ్చే దిశగా సాగుతున్నాయి. పర్యాటకం, ప్రత్యేక పంటల సాగు వంటి దిశగా ప్రభుత్వం దృష్టి సాగిస్తే- ఇక్కడి గిరిజనులకు మంచి భవిష్యత్తు ఇవ్వొచ్చు.. కొండలను తవ్వి అభివృద్ధి అనటం కన్నా- వాటిని అలాగే ఉంచి, అంతకుమించిన ప్రయోజనం పొందవచ్చు. లంబసింగిని ఆంధ్రా కాశ్మీరంగానో, ఊటీగానో అభివృద్ధి చేయవచ్చు.

- సత్యాజీ

కళలకూ కలాలకూ సంకెళ్లు

◆ అట్టమీది కథ

కులతత్వ వాదులు, మతవాదులు కలిసి ఒక తమిళ రచయిత ప్రొఫెసర్ పెరుమాళ్ మురుగన్ రాసిన నవలపై చేసిన దాడి దేశంలో సంచలనం కలిగించింది. నరేంద్ర మోడీ పాలన మొదటి పాదంలోనే ఇలా జరుగుతుంటే ముందు ముందు ఈ దేశం ఎటు పోతుందనే ఆందోళన పెంచింది. అంతకు మించిన నిరసనా వ్యక్తమైంది.

కొత్తపల్లి రవిబాబు

నిజానికి వాక్ స్వాతంత్ర్యంపై దాడులు సోక్రటీసు కాలం నుండి ఈ నాటి వరకూ కొనసాగుతూ ఉన్నాయి. అన్నీ వేదాల్లో ఉన్నాయని అనుకుంటూ సంతోషించేవారు అనేక రూపాల్లో కనబడుతున్నారు. తమిళ నాడులోనే 1966లో జానకి రామన్ రాసిన 'అమ్మ వంతాల్' అనే నవలపైనా, సల్మా అనే కవయిత్రి 2004లో రాసిన కథ 'ఇరందామ్ జామన్‌గాలి కథై' (అర్ధరాత్రి కథ), 1997లో విడుదలైన తొప్పిల్ మహమ్మద్ మిరాన్ పుస్తకం 'శైవ నార్కాలి' (పడక కుర్చీ)పైన దాడులు జరిగాయి. పాండ్యులపై కె.సెంధిల్ మల్లార్ రాసిన పుస్తకంపై సాగిన వివాద ఫలితంగా 2013లో దానిని తమిళనాడు ప్రభత్వం నిషేధించింది. కాని బిజెపి, ఆరెస్సెస్‌ల హయాంలో ఘటనలు వాటన్నిటినీ మించి ఒక వ్యూహాత్మక రూపం తీసుకుంటున్నాయి. పెరుమాళ్ ఉదంతం దానికి ఒక సంకేతం.



మురుగన్

ప్రొఫెసర్ పెరుమాళ్ మురుగన్ రాసిన 'మధోరు బాగన్' అనే నవల 2010 డిసెంబర్‌లో ప్రచురించబడింది. దీని ఇంగ్లీషు అనువాదాన్ని పెంగ్విన్ సంస్థ 2013లో విడుదల చేసింది. చెన్నైకి 410 కి.మీ దూరంలో వున్న తిరులాన్‌గోడు లోని కైలాసనాథ్ టెంపుల్‌లో అర్ధనారీశ్వరుడున్నాడు. అక్కడ జరిగే జాతరలో 14వ రోజున పిల్లలు లేని స్త్రీలు అక్కడ వున్న మగవారిలో ఎవరితోనైనా కలవవచ్చు. ఇది వంద సంవత్సరాల క్రితం అక్కడ వున్న ఆచారమని మురుగన్ ఆ ప్రాంత ప్రజలు చెబితే కనుగొన్నారు. ఆ సంఘటనను నవలలో చిత్రించినందుకు అక్కడ గౌండర్ కులం వారికి కోపం తెప్పించింది. మురుగన్‌ది కూడా అదే కులం. ఆ ఆచారం పాటించే వారు గౌండర్ కులంవారే. నిజానికి నాలుగేళ్ల కాలంలో ఈ నవల 3000 కాపీలు అమ్ముడయ్యాయి. డిసెంబర్‌లో మరో 2000 కాపీలు ముద్రించారు. ఇంగ్లీషు అనువాదం 1000 కాపీలు అమ్ముడుపోయాయి.

ఇప్పుడు కొత్తగా ఈ వివాదం ఎందుకు రేగింది? 20 ఏళ్లగా తమిళ ఆచార్యునిగా వున్న మురుగన్ నవలలు, కథలు, కల్పితాలే కాక తమిళనాడులో వ్యాపించిన విద్యా వ్యాపారాన్ని దుయ్యబడుతూ వ్యాసాలు రాశారు. ఫ్యాక్టరీ స్కూళ్లుగా మారిన పాఠశాలల్లో ... పాఠాలు అప్పచెప్పడం మాత్రమే జరగడాన్ని నిశితంగా విమర్శించారు. కార్పొరేటు పాఠశాలల్లో చిలుక పలుకుల విద్యపై దాడి చేశారు. సేలం కలెక్టర్‌గా పనిచేసిన యు.సహాయం ఈ విద్యాలయాలపై తీసుకున్న చర్యలను వివరిస్తూ ... కులతత్వ బాధితులైన విద్యార్థులు రాసిన 32 వ్యాసాల సంకలనం మురుగన్ వెలువరించారు.

ఈ నేపథ్యంలోనూ, పునరుద్ధరణ వాదం పుంజుకుంటున్న తరుణంలో కులతత్వ మతతత్వ వాదులు విజృంభించగా ఆ పట్టణ పోలీసు అధికారులు మురుగన్‌ను కుటుంబ సహితంగా ఊరు వదిలి అజ్ఞాతంలోకి వెళ్లమని సలహా ఇచ్చారు. ఆ తర్వాత నమక్కల్ జిల్లా కలెక్టర్

కార్యాలయంలో ఉన్నతాధికారులు ఏర్పాటు చేసిన 'శాంతి సమావేశం'లో శాంతి ఒప్పందం జరిగింది. అధికారులు ఏమీ చేయలేని దశలో నిస్సహాయులుగా వుండడాన్ని గమనించిన మురుగన్ ఒక ప్రకటన విడుదల చేసి 'ఈరోజు నుంచి మురుగన్ అనే రచయిత మరణించాడు. ఇక ముందు పాఠాలే చెబుతాడు. రచనలు చేయడు' అని ప్రకటించాడు.

నిజానికి పురాతన లైంగిక ఆచారాల గురించి... వాటి చరిత్ర గురించి ... రాసిన వారిలో మురుగన్ మొదటివారు కాదు. ఆఖరి వాడూ కాదు. థియొడర్ భాస్కరన్, ప్రొఫెసర్ వి.కె.పెరుమాళ్ ఇటువంటి ఆచారాలు రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో వున్నట్లు చెప్పారు. 'దుప్పటి పండుగ'లో స్త్రీ పురుషులు తలకు ముసుగులు ధరించి లైంగిక కార్యక్రమాలు చేసే ఆచారం గురించి ప్రస్తావించారు. తాపీ ధర్మారావు రాసిన పుస్తకంలో 'రవికెల పండుగ' గురించి వివరించారు. చంద్రలత రాసిన 'రేగడి విత్తులు'లో అలంపురంలో వున్న ఒక దేవాలయంలో సంతానం లేని వాళ్ల పాటించే ఆచారం గురించి వివరించారు.

పలువురు రచయితలు, మేధావులు మురుగన్ తీసుకున్న తీవ్ర నిర్ణయం వెనుక వున్న పరిస్థితులను ఖండించడమే కాక... మురుగన్‌కు తమ మద్దతు ప్రకటించారు. ప్రఖ్యాత చరిత్రకారిణి రొమిలా థాపర్ ఇటీవల నిఖిల్ చక్రవర్తి స్మారకోపన్యాసం ఇస్తూ ప్రజాతంత్ర వాదులు, మేధావులు ఇటువంటి విషయాల పట్ల ప్రశ్నించడమా, మానడమా అనే సందిగ్ధంలో వుండడం మంచిది కాదు. మౌనం వీడాలి, ప్రశ్నించాలి' అన్నారు. ఎన్నో ఏళ్ల కిందట బెట్రాండ్ రసెల్ స్మారకోపన్యాసం ఇస్తూ జస్టిస్ ఓ.చినప్పరెడ్డి పునరుద్ధరణవాద ప్రతిఘటన అనేది వర్గ పోరాటంలో భాగంగా సాగాలని ఇచ్చిన పిలుపును అందరం జ్ఞాపకం తెచ్చుకోవాలి.

సెన్సార్ ...సెన్సార్!

ఆర్.ఎస్.ఎస్ సీనియర్ సభ్యుడు దీననాథ్ బత్రా ఎమ్.ఎఫ్.హుస్సేన్ గురించి ఉన్న పాఠంపైనా, అవతార్ సింగ్‌పాష్ అనే కవి రాసిన కవిత్వంలో వర్గ పోరాటం, సామాజిక అసమానతలు ఉన్నాయి కనుక ఆయన కవిత్వంపైనా దాడులు చేశారు. హిందూయేతర ఉర్దూ పదాలైన 'ముష్కిల్', 'దోస్త్', 'గుస్సా', 'షరారత్', 'ఖబడ్దార్', 'గాయబ్', 'మొహల్లా', 'మౌకో', 'అక్బర్' అనే పదాలను వాడకూడదని నిషేధించారు. స్మృతి ఇరానీ ప్రవేశపెట్టబోయే నూతన విద్యా విధానానికి మచ్చుతునకలు ఇవి!

దీననాథ్ బత్రా స్థాపించిన ఎస్ఎస్‌యుఎన్‌కు తోడుగా ఏర్పడిన మరో సంస్థ 'శిక్షా బచావో ఆందోళన సమితి'. ప్రముఖ పుస్తక ప్రచురణకర్తలు ప్రచురించిన చరిత్ర, సామాజిక శాస్త్రాల గ్రంథాలలో వారి దృక్పథాన్ని ప్రతిబింబించని వాటిపై ఆందోళన చేసింది. ఆ పుస్తకాలను ఉపసంహరించుకోకపోతే, వారి కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులపై దాడి చేస్తామని హెచ్చరించింది. ఓరియంట్ బ్లాక్ స్వాన్ ఒక దశాబ్దం క్రితం వెలువరించిన ఓ పాఠ్య గ్రంథంపై వీరు చేసిన విమర్శలు ఆధారంగా వారు విడుదల చేయబోయే అన్ని విద్యాసంబంధమైన గ్రంథాలను తిరిగి పరిశీలించుకుంటున్నాం. న్యూజిలాండ్‌లోని విక్టోరియా యూనివర్శిటీ ఆఫ్ వెల్లింగ్టన్‌లో చరిత్ర ఆచార్యుడైన శేఖర్ బంధోపాధ్యాయ రాసిన పాఠ్యగ్రంథం 'ప్లాసీ టు పార్టిషన్, ఎ హిస్టరీ ఆఫ్ మోడరన్ ఇండియా'లో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై నిందలున్నాయని, ఆర్ఎస్ఎస్ వారి అధికార పత్రిక 'ఆర్గనైజర్' లో రాశారు. అలాగే ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయంలో రోడ్స్ స్కాలర్‌గా ఉన్న శ్రీమతి మేఘా కుమార్ రాసిన 'కమ్యూనిజం అండ్ సెక్సువల్ వయొలెన్స్–అహ్మదాబాద్ సిన్స్ 1969' అనే పుస్తకాన్ని బాగా పున:పరిశీలించిన తర్వాతే విడుదల చేయమని ఆ పుస్తక రచయిత్రి ప్రచురణకర్తలను కోరారు. వీటన్నింటి కంటే ముందే అమెరికన్ ఇండాలజిస్ట్ వెండీ డోనిగర్ రాసిన 'ది హిందూస్ ఆన్ ఆల్టర్నేటివ్ హిస్టరీ' పుస్తకాన్ని దాని ప్రచురణకర్తలైన పెంగ్విన్ ఇండియా వారు ఉపసంహరించుకున్నారు.

ఇంకొంచెం వెనక్కి వెళ్తే వాజ్‌పేయి ప్రధాన మంత్రిగానూ, అద్వానీ హోం మంత్రిగానూ ఉన్న కాలంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారిక్ రిసెర్చి

రొమిలా థాపర్



దిలీప్ కుమార్

అటల్జీ 'పీఠం'లోనే....



సఫ్దర్ హష్మీ

మిగిలిన బిజెపి నేతలతో పోలిస్తే మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిని 'మధ్యే'వాదిగా చెబుతుంటారు. ఆయన మరీ తీవ్రంగా మాట్లాడకపోవడం అందుకు కారణం కావచ్చు. అయితే ఆయన పోటీ చేసిన లక్నో నియోజక వర్గంలో కూడా కళాకారులపై దాడుల ప్రక్రియ యథా ప్రకారం జరిగింది. లౌకిక విలువల పరిరక్షణ కోసం సఫ్దర్ హష్మీ స్ఫూర్తితో ఏర్పడిన 'సహమత్' సంస్థ నిర్వహించిన రాగమంచ్‌పై దాడి తీవ్ర విమర్శలకు దారి తీసింది. రాగమంచ్ తరపున 'తీన్ తేరా చక్కర్' అనే వ్యంగ్యాత్మక వీధి నాటిక యు.పి, ఎం.పిలలో యాభైకి పైగా ప్రదర్శనలతో ప్రజలను బాగా ఆకట్టుకుంది. దాంతో బిజెపి ప్రభుత్వాలు ఆగ్రహించి అనుమతి నిరాకరించడం మొదలుపెట్టాయి. ఆగ్రాలో ప్రదర్శనను అడ్డుకుని ప్రెస్‌క్లబ్‌లోనే దిగ్బంధనం చేసినంత పని చేశాయి. అయినా జంకక ఆ కళాకారులు 1999 సెప్టెంబర్ 20న దాన్ని లక్నోలో ప్రదర్శించాలని నిర్ణయించుకున్నారు. ఆ రోజున బిజెపి ఎం.ఎల్.సి అజిత్ సింగ్ నాయకత్వంలో వారి వాహనాన్ని అడ్డుకుని డ్రైవర్‌పైన, కళాకారులపైన దౌర్జన్యం జరిపారు. ఆ దాడులకు బెదరక ప్రదర్శన కొనసాగించిన కళాకారులు 22న లక్నో జిపివో దగ్గర పెద్ద ధర్నా జరిపారు. ఢిల్లీలో రాష్ట్రపతికి మెమొరాండంఇచ్చారు. దేశవ్యాపితంగా కూడా జరిగిన నిరసనలకు దిలీప్ కుమార్, రాజ్‌బబ్బర్ వంటి ప్రముఖులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. 'సహమత్' ఇలాంటి దాడులు అనేకం ఎదుర్కొన్నది.



ఎం.ఎఫ్.హుస్సేన్



(భారత చరిత్ర పరిశోధనా మండలి)లో చరిత్రకారులైన ప్రొఫెసర్ సుమిత్ సర్కార్, కె.ఎన్.పణిక్కర్, దీపా మెహతాలు రాసిన వివాదాస్పదమైన రెండు సంపుటాలు "టు వర్డ్స్ ఫ్రీడం" అనే దానిని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ వారు అకస్మాత్తుగా ఉపసంహరించుకున్నారు. ఈ పుస్తకంలో 1937 నుండి 1947 దశాబ్దపు చరిత్ర నమోదైంది. అయితే ఆ కాలంలో జనసంఘ్ దాని అనుబంధ సంస్థలు, మాతృ సంస్థ చేసిన కార్యక్రమాలు శూన్యం కావడంతో వారు ఈ పుస్తకంలోనికి ఎక్క లేదు. కనుక వీటిని ఉపసంహరించమని మతతత్వ వాదులు కోరారు. ఈ పుస్తకానికి 1940లో సర్కార్, 1946లో పణిక్కర్ సంపాదకత్వం వహించారు. అయితే అప్పట్లో విశ్వహిందూ పరిషత్తుకు చెందిన ప్రొఫెసర్ బి.ఆర్. గ్రోవర్ ఈ భారత చరిత్ర పరిశోధనా సమితికి బాధ్యుడు. రచయితలకు ఎటువంటి సమాచారమూ ఇవ్వకుండా వీటిని ఉపసంహరించారు.

నిషేధం నీడన...

రాజ్యం అనబడే సెన్సార్ కత్తెర నీడలో కళ, సినిమా సృజించాల్సి వస్తే...!? కళాకారులు, రచయితలు, దర్శకులను నిత్యం ఓ కంట కనిపెడుతూనే వుంటుంది. మోడీ కాలంలో గుజరాత్‌లో ఇదే జరిగింది. ఉదాహరణకు: 2003లో అహ్మదాబాద్‌లో 'గోద్రా తక్: ది టెర్రర్ ట్రయల్' అనే డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించినప్పుడు విహెచ్‌పి వంటి హిందూత్వ శక్తులు దాన్ని అడ్డుకున్నాయి. పైగా చిత్ర దర్శకుడు చక్రవర్తిని సినిమాలు తీయొద్దని కూడా హుకుం జారీ చేశాయి. 2004లో రాకేష్ శర్మ రూపొందించిన 'ది ఫైనల్ సొల్యూషన్' డాక్యుమెంటరీని కూడా ప్రదర్శనకు అంగీకరించలేదు. 2002 గుజరాత్‌లో జరిగిన మత ఘర్షణలపై తీసిన చిత్రం కావడమే అందుకు కారణం. పైగా రాష్ట్ర(దేశ) భద్రతను ఛిద్రం చేసే అంశాలు వున్నందునే దాన్ని నిరాకరించారట.

పార్సీ కుటుంబపు నిజ జీవిత గాథ ఆధారంగా తీసిన 'పర్జానియ' చిత్రం సెన్సార్ పూర్తి చేసుకున్నప్పటికీ నిషేధం వేటు వేశారు. బజరంగ్ దళ్ కార్యకర్తలు థియేటర్ యజమానులకు ఆ చిత్రాన్ని ప్రదర్శించవద్దని కూడా బెదిరించారు.

2006లో వి.వి.దోషి ఆర్ట్ గ్యాలరీ మీద కూడా మిత వాద సంస్థలు దాడి చేశాయి. ఎం.ఎఫ్.హుస్సేన్ చిత్రాలను నాశనం చేశాయి. సర్దార్ సరోవర్ ఆనకట్ట ఎత్తు పెంచిన సందర్భంలో నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో మోడీ ప్రభుత్వంపై విమర్శలు చేశాడన్న మిషతో అమీర్ ఖాన్ 'ఫనా' (2006) చిత్ర ప్రదర్శనను కూడా అడ్డుకున్నాయి కాషాయ మూకలు.

బరోడా ఎంఎస్ యూనివర్సిటీకి చెందిన ఆర్టు విభాగంలో తెలుగు విద్యార్థి చంద్రమోహన్ వేసిన చిత్రాలు ... హిందూ మత విశ్వాసాలను దెబ్బ తీసేలా వున్నాయన్న మిషతో అరెస్టు చేశారు. విద్యార్థుల చిత్రకళా ప్రదర్శనలో అతని చిత్రాలను బజరంగ్‌దళ్ మూకలు నాశనం చేశాయి.

2014 జూన్ మాసంలో సినీ దర్శకుడు, జర్నలిస్టు సుభ్రదీప్ చక్రవర్తి తీసిన 'ఎక్ దినో ముజఫర్ నగర్' డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శనకు ఫిల్మ్ బోర్డు అనుమతి నిరాకరించింది. ముజఫర్ నగర్ (ఉత్తరప్రదేశ్)ను వణికించిన మత ఘర్షణలను కళ్లకు కట్టినందుకే ఈ నిషేధపుటాజ్ఞలు.

కాబట్టి పెరుమాళ్ మురుగన్ ఉదంతం సంఘ పరివార్ హిందూత్వ దౌర్జన్య చర్యల్లో మొదటిది కాదు. మరీ ముఖ్యంగా మోడీ అధికారంలోకి వచ్చాక ఈ విధమైన దాడులు మరీ పెరిగిపోతున్నాయని అర్థం కావడానికి ఈ ఉదంతాలే సాక్ష్యం. అమీర్ ఖాన్ 'పికె' చిత్రం నుంచి ఇప్పుడు గుర్మీత్ రామ్ రహీం సింగ్ 'ఎంఎజి' (ఓ మై గాడ్) చిత్రం వివాదం వరకూ చూస్తే సెన్సార్ బోర్డు మొత్తం దిగిపోవలసి వచ్చింది. అచ్చంగా బిజెపి అనుకూల మోడీ భక్త బృందం అక్కడ తిష్ఠ వేసింది. రాజకీయ తేడాలు ఇతర విభేదాలు పక్కన పెట్టి ప్రజాస్వామ్య విలువలు గౌరవించే వారంతా ఒక్క తాటిపైకి వస్తేనే ఈ బెదిరింపులను అడ్డుకోగలం. లేకపోతే మురుగన్ వంటివారు మూగపోతారు.

పుస్తకాలపై కత్తి

సుప్రసిద్ధ భారతీయాంగ్ల రచయిత ఎ.కె.రామానుజం. '300 రకాల రామాయణాలు' అన్న పేరిట ఆయన రచించిన పుస్తకం ఢిల్లీ యూనివర్సిటీలో పాఠ్యాంశంగా వుండేది. అయితే ఆ పుస్తకంలో రాముణ్ని అవమానించాడంటూ పరివార్ దుమారం లేవదీసింది. చివరకు దాన్ని ఉపసంహరించారు. 'రాముడికి సీత ఏమవుతుంది?, రామాయణ రహస్యాలు, రామాయణ విషవృక్షం' వంటి పుస్తకాలు తెలుగులో ఎంతగా పాఠకాదరణ పొందిందీ మనకు తెలుసు. కాని పరివార్ పట్టు పెరిగిన తర్వాత విశ్వవిద్యాలయాల్లో కూడా రక్షణ లేకుండా పోయింది. అంతకు ముందు ముంబై విశ్వవిద్యాలయం రోహింత్ మిస్త్రీ రచించిన 'సబ్ ఎలాంగ్ జర్నీ' అన్న పుస్తకాన్ని ఇదే రీతిలో ఉపసంహరించింది.

పరిశోధనా కేంద్రంపై దాడి

హిందూత్వ శక్తుల దాడులకు గురికాని సాంస్కృతిక విభాగమంటూ లేదంటే అతిశయోక్తి కాదు. పూనాలోని భండార్కర్ ఓరియంటల్ ఇన్‌స్టిట్యూట్‌పై 2003లో దాడి జరిగింది. జేమ్స్ డబ్ల్యు లైనీ ఎప్పుడో రచించిన శివాజీ జీవిత చరిత్రలో తప్పులున్నాయంటూ దాడి చేసిన దుండగులు ప్రాచీన రాతప్రతులు ఫర్నిచర్ కూడా ధ్వంసం చేశారు. ఈ దారుణాన్ని నాటి ప్రధాని వాజ్‌పేయి లాంచనంగా ఖండించవలసి వచ్చింది. 'మీకు నచ్చకపోతే మరో పుస్తకం రాసుకోవాలి గాని దాడులేమిటి?' అని ఆయన సుతిమెత్తగా మందలించారు!

వెండీ డోనిజర్



◆ సమ్‌థింగ్ స్పెషల్

చెల్లని పెళ్లికి విడాకులు

పశ్చిమ దేశాలలో సాయంత్రం పెళ్లి చేసుకొని రాత్రికి కాపురం చేసి నచ్చలేదంటూ తెల్లవారే సరికి విడాకుల కోసం కోర్టులకు ఎక్కేట్లుగా పరిస్థితులుంటాయని తెలిసిందే. అందుకే సదరు న్యాయమూర్తి కూడా విడాకులే కదా, ఇద్దరు చెప్పినా ఒకరు చెప్పినా ఒకటే కదా ఇస్తే పోలా సమయం వృధా ఎందుకనుకున్నాడో ఏమో తీర్పు ఇచ్చాడు. తీరా నాలుక కరచుకొని తూచ్ నా తీర్పు చెల్లదు, వెనక్కు తీసుకుంటున్నా అని తన సుత్తితో తన తలమీద తానే కొట్టుకున్నాడు. ఆశ్చర్యంగా ఉంది కదూ! ఆలస్యమెందుకు చదవండి మరి.

అమెరికాలో ఒక రాష్ట్రం పేరు ఓహియో. బ్రెండా మోహానే, ఎరిన్ ఓ లియరీ అనే వారు 2008లో కాలిఫోర్నియాలో వివాహం చేసుకున్నారు. జూలైలో వారు ఏథెన్స్ కౌంటీ కోర్టుకు విడాకుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. విచారణ సందర్భంగా మోహానే ఒక్కతే కోర్టుకు వచ్చింది. సదరు న్యాయమూర్తి నవంబరు 25న విడాకులు మంజూరు చేశారు. ఆ తరువాత గాని సదరు న్యాయమూర్తికి తన తప్పిదం ఏమిటో తెలిసింది. ఆ రాష్ట్ర చట్టాల ప్రకారం అసలు ఆ వివాహమే చెల్లదు. ఎందుకంటే దరఖాస్తుదారులిద్దరూ మహిళలే. విచారణ సందర్భంగా ఒకరు మాత్రమే వచ్చినా న్యాయమూర్తి పట్టించుకోలేదు. తన తీర్పును రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తరువును మాత్రం ఆ పెద్దమనిషి మేలుకొనే రాశాడు. కరవ మంటే కప్పకు కోపం విడవ మంటే పాముకు కోపం అన్నట్లుగా ఉండటంతో స్వలింగ వివాహాల గురించి అమెరికా సుప్రీం కోర్టే ఇంతవరకు వైఖరిని ప్రకటించలేదు. అందువలన ఓహియో రాష్ట్రం వాటిని గుర్తించలేదు

కనుక తన తీర్పు రద్దయినట్లు భావించాలని నిర్ణయిస్తూ సదరు మహిళల సంబంధం గురించి వ్యక్తిగతంగా తానేమీ అభిప్రాయాలు వ్యక్తం చేయటం లేదని, వివాదాస్పద ఇలాంటి వివాహాలపై ఉన్నత న్యాయస్థానాలు నిర్ణయించాల్సి ఉంటుందని ఆ కేసు నుంచి బయట పడ్డారు.

మారాల్సింది వారే

ఆదేశించే లేదా గద్దించే 'వస్త్ర తాలిబాన్లు' మన దేశంలోనే కాదు, అమెరికాలో కూడా ఉన్నారు. ఉత్తర డకోటా విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ మధ్య ఒక సర్వే నిర్వహించారు. మా మీద ఎలాంటి చర్యలూ తీసుకోకుండా ఉండేట్లయితే ఈ క్షణంలో రేప్‌లు చేయటానికి సిద్దంగా ఉన్నామని ప్రతి ముగ్గురిలో ఒక కాలేజీ కుర్రవాడు చెప్పాడట. ప్రశ్నలు వేసిన వారు తొలుత రేప్ అనే పదం ఉపయోగించకుండా శృంగారం కోసం అమ్మాయిలను ఒత్తిడి చేస్తారా అని అడగ్గా మా మీద ఎలాంటి కేసులు పెట్టరు అనుకుంటే సిద్దంగా ఉన్నామని 31.7శాతం చెప్పారట. తరువాత అంటే రేప్ చేయటానికి కూడా సిద్ధపడతారన్న మాట అంటే అప్పుడు వారు సర్దుకొని కేసులు ఉండవు అనుకుంటే చేస్తామని 13.6 శాతం చెప్పారట. తాము కొద్ది మందిని మాత్రమే ప్రశ్నించి సమాధానాలు రాబట్టామని రాబోయే రోజుల్లో పెద్ద సంఖ్యలో ప్రశ్నించి కుర్రకారు ధోరణులపై ఒక అభిప్రాయానికి వస్తామని పరిశోధకులు చెప్పారు. శృంగారం కోసం మహిళలను వత్తిడి చేస్తామని చెప్పటం గమనించాల్సిన అంశం, అదే బలవంతం చేస్తారా అన్నపుడు అనేక మంది వెనక్కు తగ్గారు. ఆడవారంటే ఆటబొమ్మలని, లైంగిక ఆధిపత్యం కొనసాగించాలనే పురుష దురహంకారం ఇప్పటికీ బలంగా ఉండటం వల్లనే ఇలా చెప్పారని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఇటీవలి కాలంలో అమెరికా ఉన్నత విద్యాసంస్థలలో అత్యాచారాలు పెరిగిపోతున్న

నేపథ్యంలో ఈ పరిశోధన జరిగింది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. దీనిపై మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. విద్యార్థినుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. దానిలో భాగంగానే ఎలాంటి దుస్తులు వేసుకోవాలో మాకు చెప్పటం కాదు, రేప్‌లు చెయ్యవద్దని కుర్రవాళ్లకు చెప్పండనే ప్లకార్డులతో ప్రదర్శనలు చేస్తున్నారు.

గతంలో ఐక్యరాజ్యసమితి తరపున జరిగిన సర్వేలలో ఆడవాళ్ల శరీరాలపై తమకు హక్కుందనే అభిప్రాయాన్ని పురుషులు కలిగి ఉన్న కారణంగానే అత్యాచారాలకు పాల్పడుతున్నారని తేలింది. అమెరికాలోని యువకులు అమ్మాయిలను లాఘవంతో ముగ్గులోకి లాగుతున్నారని తరువాత వదలి వేస్తున్నారని తేలింది. కుర్రవాళ్లు తమ వాంఛలను అదుపు చేసుకోలేరని అందువలన అమ్మాయిలను బలవంత పెట్టటం, కొట్టడం మామూలే అని యువతులు కూడా అభిప్రాయ పడుతున్నట్లు సర్వేలో తేలింది.

కాలేజీల్లో జరుగుతున్న అత్యాచారాలను నిరోధించాలంటే బీరుపై పన్నులు ఎక్కువగా విధించాలని, గంజాయి దమ్మును ప్రోత్సహించాలని న్యూయార్క్ మాగజైన్‌లో అనీ లోవరీ అనే రచయిత్రి పరిష్కారాన్ని సూచించారు. కాలేజీ కుర్రవాళ్లు మందు తాగి నేరాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వ పరిశోధనలు పేర్కొంటున్నాయి. ఏటా 97వేల మంది అంటే రోజుకు 300 మంది డేటింగ్ సందర్భంగా హింస లేదా తాగిన సమయంలో అత్యాచారాలకు గురవుతున్నారని లెక్కలు తేలాయి. మందుతాగినపుడు సామాజిక స్పృహను కోల్పోయినందున నేరాలు జరుగుతున్నట్లు, వాటిని సమర్ధించుకొనేందుకు ఆ సమయంలో తాగి ఉన్నందున ఏం చేస్తున్నదీ తెలియలేదని చెప్పి తప్పించుకుంటున్నారని తేలింది. అయితే కేసుల సంఖ్యను ఎక్కువ చెబుతున్నారని కొందరు విబేధిస్తున్నారు.

అనీ లోవరీ మాత్రం వాటిని విశ్వసిస్తూ కుర్రకారు తాగ కుండా ఉండాలంటే మద్యంపై పన్ను పెంచాలని, కాలేజీల దగ్గర ఉన్న బార్లకు ఎక్కువ ఫీజు వసూలు చేయాలని, పార్టీలలో ఉచితంగా తాగనివ్వకూడదని, పనిలో పనిగా గంజాయి దమ్ము ఎక్కువ కొట్టనిస్తే ఆ మత్తులో మునిగి పోయి నేరాలకు దూరంగా ఉంటారని కూడా ఆమె సూచించటంపై అపహాస్యం, విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- సత్య

ప్రేమ... విప్లవం...

◆ సీరియల్

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ



(భాగం -21)

మూలం : మేరీ గేబ్రియెల్ 'లవ్ అండ్ కేపిటల్'

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి

పారిస్, జూన్ 1848

నాటికి పారిస్‌లోని స్త్రీ, పురుషులందరూ సాయుధులయ్యారని ఒక నానుడి ప్రచారంలో ఉంది. వర్గ వైషమ్యాలు తారా స్థాయికి చేరాయి. ఇక సామరస్యానికి అవకాశమే లేదు. ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైంది. ఆహార కొరత తీవ్రమైంది. అన్నార్తుల సంఖ్య పెరిగింది. వీధుల్లో గుమిగూడిన జనం వేసిన ఆకలి కేకలు మిన్నంటాయి. కార్మికులంతా కలిసి జూన్‌లో ఒక విందు కోసం ఏర్పాట్లు చేస్తున్నారని మే నెలలోనే వదంతులు ప్రచారమయ్యాయి. 'విందు' అంటే 'తిరుగుబాటే' అని స్పష్టమవుతూనే ఉంది. అయితే చివరికి తిరుగుబాటుకు కారణమైంది విందు కాదు. లామర్టైన్ ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ భద్రతా పథకాన్ని ఉపసంహరించుకోవాలని నేషనల్ అసెంబ్లీ కమిటీ నిర్ణయించింది. అసెంబ్లీ సభ్యుడైన విక్టర్ హ్యూగో (ప్రముఖ ఫ్రెంచి నవలా రచయిత) ఈ నిర్ణయం వల్ల 'ముష్టివాళ్ల సైన్యం' తయారవుతుందన్నారు. వీళ్లను అణచటానికి "నియంతలు తమ సైన్యాన్ని పురికొల్పుతారు". కాని ప్రభుత్వ ఖజానా ఖాళీ అయింది. అందువల్ల ఉద్యోగ పథకంలో కోతలు పెట్టక తప్పలేదు. ఇదే ఈ ప్రభుత్వ వ్యతిరేక రాడికల్స్‌కు ఆయుధంగా మారింది. ప్రభుత్వ ఉద్యోగాల కోసం వర్కుషాపులున్నాయి గాని వీటిని కూడా ఎప్పుడు మూసేస్తారో తెలియదు. డబ్బుల్లేవని ప్రభుత్వం చేతులెత్తేసింది. లక్ష కుటుంబాలు రోడ్డున పడటం ఖాయం. ప్రజల ఆందోళనకు ఆజ్యం పోస్తూ వర్కుషాపులను మూసేస్తారనే ప్రచారం జరిగింది. ఇంకేముంది నిరసనలు పెల్లుబికాయి. 'బుల్లెట్స్ ఆర్ బ్రెడ్', 'బుల్లెట్స్ ఆర్ వర్క్' నినాదాలు మార్మోగాయి. నగరమంతా బారికేడ్లు మళ్లీ దర్శనమిచ్చాయి. జూన్ 23 నాటి పారిస్‌లోని ఒక ప్రాంతం కార్మికుల అధీనమైంది. జూన్ 24 నాడు, అల్జీరియా మాజీ నియంత, యుద్ధ మంత్రి జనరల్ లూయీ యూజీన్ కవానాక్ ఎదురు దాడి ప్రారంభించాడు.

"జూన్ చివరి వారానికి లండన్, బ్రసెల్స్‌ల నుండి కమ్యూనిస్టు లీగ్ నాయకులు కొలోన్ చేరుకుని తదుపరి కార్యాచరణ కోసం సిద్ధంగా ఉన్నారు. కాని మార్క్స్ సంస్థనిక రద్దు చేయాల్సిందేనన్నాడు. జనం తమ డిమాండ్ల గురించి వీధుల్లో బహిరంగంగా నినాదాలు చేస్తున్నప్పుడు సాయుధులై ప్రదర్శనలు నిర్వహిస్తున్నప్పుడు ఇంకా రహస్య సంస్థ ఎందుకన్నది ఆయన వాదం. ప్రతి విషయంలోనూ తద్వ్యతిరేక లక్షణాన్ని (వైరుధ్యాన్ని) చూడగలిగే మార్క్స్, విప్లవ పరాజయంలోనే విప్లవ విజయ బీజాలున్నాయన్నాడు."

ఆ రోజు తుఫాను గాలి, భీకర వర్షంతో తడిసిపోయింది పారిస్. అయినా యుద్ధం ఆగలేదు. సాయంత్రం ఆరింటి నుండి శతఘ్నులు భవనాల మీద, బారికేడ్ల మీద గుళ్ల వర్షం కురిపించాయి. స్త్రీ, పురుషులనే తేడా లేకుండా ఎక్కడివాళ్లక్కడే నేలకొరిగారు. వీధుల్లో పరచిన రాళ్లమీద నెత్తురు వరదగా పారింది. ఇళ్ల ముందరి భాగాలు శతఘ్ని గోళాల తాకిడికి తుత్తునియలైనాయి. ఎక్కడ చూసినా కూలిన భవనాల రాతి, మట్టి దిబ్బలే. దుకాణాల గాజు కిటికీలు పగిలిపోయాయి. లోపలి వస్తువుల్ని ఎవరికి కావలసింది వాళ్లు తీసుకుని పోవచ్చు - మృత్యుభయం సర్వత్రా వ్యాపించిన ఆ రాత్రి పారిస్ వీధుల్లోకి అడుగిడగలిగిన ధైర్యవంతులదే ఆ సంపద! యుద్ధం మొదటిరోజునే, నేషనల్ అసెంబ్లీ, తన శాసనాధికారాలన్నీ కవానాక్‌కు బదలాయించింది. ఆనాటి ఫ్రెంచి ప్రజాస్వామిక రాజకీయ నాయకులకు, కార్మికుల తిరుగుబాటుకున్న నియంతపాలనే మెరుగనిపించింది. కాని కవానాక్‌కు కొత్తగా సంక్రమించిన అధికారాలతో కార్మికులు బెదిరిపోలేదు సరికదా, మరింత రెచ్చిపోయారు. రోజురోజుకూ తీవ్రతరమైంది సంగ్రామం.

లక్షలాది మంది స్త్రీ, పురుషులు వీధి యుద్ధాల్లో పాల్గొన్నారు. "మిలిటరీ అనుభవం లేకపోయినా అత్యంత చాకచక్యంగా యుద్ధం చేశారు. వీళ్ల పోరాట పటిమ ఏ సుశిక్షితులైన సైనికులకూ తీసిపోదు" అన్నాడు తుకెవిత్. మహిళలు ఆయుధాలు తయారు చేశారు. పురుషులు వాటిని ఉపయోగించారు. మగవాళ్లు అలసిపోయినప్పుడు, మరణించినప్పుడూ, స్త్రీలు స్వయంగా సమరంలో పాల్గొన్నారు. చిన్న పిల్లలు వాళ్లకు సాయం చేశారు. నాలుగు రోజుల పాటు చెలరేగిన భీకర పోరాటంలో సైన్యాన్ని నిలువరించటానికి సర్వశక్తులా ప్రయత్నించారు తిరుగుబాటుదారులు.

జూన్ 26 నాటికి యుద్ధం

పరిసమాప్తమైంది. కనీసం పదిహేను వందల మంది హతులయ్యారు. బారికేడ్లు ధ్వంసమైన తర్వాత కూడా సైనికుల హత్యాకాండ ఆగలేదు. తిరుగుబాటుదారులను వెదికి, వేటాడి మరీ చంపారు. ఆ వేట తర్వాత మృతుల సంఖ్య మూడు వేలకు పెరిగింది. పదిహేనువేల మందిని అరెస్టు చేశారు. నలభై అయిదువేల మందిని బలవంతంగా పశువుల మందల్లాగా అల్జీరియాకు తరలించారు. చాలా మందికి అక్కడికి వెళ్లటమంటే మరణశిక్షతో సమానం. ఇంతమందిని బలిగొన్న తర్వాత కూడా అసెంబ్లీ ఏ మాత్రం చలించలేదు.

కార్మికులను చిత్తుచిత్తుగా ఓడించిన కవానాక్, మార్షల్ లా విధించి, అధ్యక్ష భవనానికి సమీపంలో యాభైవేల మంది అశ్వికులను కాపలా పెట్టాడు. రాడికల్ క్లబ్బులను మూసేయించాడు. సత్ప్రవర్తన రుసుముగా 24,000 ఫ్రాంకులు చెల్లించిన పత్రికలకు మాత్రమే ప్రచురించగలిగే అవకాశమిచ్చాడు. చివరికి తిరుగుబాటుకు శిక్షగా కార్మికులందరికీ రోజువారీ పనిగంటల మీద పరిమితిని తొలగించాడు. ప్రజాస్వామ్య ప్రయోగం ముగిసింది. కమ్యూనిస్టు నాయకుడు లూయీ బ్లాంక్ ఇంగ్లాండుకు పారిపోయాడు. పని హక్కుల కోసం, సమానత్వం కోసం, ప్రాతినిధ్య హక్కు కోసం పోరాడిన వేలాది మంది జైలు పాలయ్యారు.

జూన్ 24న ప్రారంభించి, మార్క్స్ ప్రతిరోజూ ఈ పరిణామాలను తన పత్రికలో ప్రచురించాడు. విశేషమేమిటంటే మరే పత్రికా, ఈ విషయాలను, సంఘటనలను ఇంత త్వరగా, ఇంత సవిస్తారంగా ప్రచురించలేదు. ఈ వార్తా కథనాలతో అధికారవర్గాల్లో కలవరం మొదలైంది. ఫిబ్రవరి తిరుగుబాటు జరిగినప్పుడు, ఆ వార్తలు బెర్లిన్ చేరటానికి రోజులు పట్టింది. ఇప్పుడు గంటల వ్యవధిలో పత్రికల వాళ్లకు తెలిసిపోతున్నాయి. పారిస్ తిరుగుబాటు స్థానికంగా కూడా అల్లర్లకు దారితీస్తుందని ప్రభుత్వాలకు భయం మొదలైంది. అక్కడా ఇక్కడా ఒకే రకమైన వర్గవైషమ్యాలు, ఒకే రకమైన ఉద్రిక్త పరిస్థితులు. పరిస్థితి ఎప్పుడైనా చేతులు దాటొచ్చు.

జూన్ 26 నాటి పత్రిక మొత్తం కేవలం పారిస్ సంఘటనలకే కేటాయించాడు మార్క్స్. క్షణక్షణం ఉత్కంఠత రేకెత్తించింది ఆ కథనం :

"పారిస్ రక్తస్నానం చేసింది. తిరుగుబాటు చరిత్ర ఇంతవరకూ కనీవినీ ఎరుగని మహావిప్లవంగా పరిణమించబోతున్నది. బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా పోటెత్తిన కార్మిక విప్లవమిది."

"ఇప్పటివరకు జరిగిన తిరుగుబాట్లకూ దీనికీ తేడా వుంది. ఇప్పుడెవరికీ భ్రమలు లేవు. పార్టీ కోసం ప్రాణాలిస్తామనడం లేదు. జూన్ 23 నాడు కార్మికులు తమ ఉనికి కోసం పోరాడారు. వాళ్ల దృష్టిలో, ఇప్పుడు 'స్వదేశం' అనే మాటకు అర్థం లేదు" అన్నాడు ఎంగెల్స్.

"బూర్జువాలు దాచి ఉంచాలనుకున్న సామాజిక వాస్తవికతను బహిర్గతం చేసిందీ తిరుగుబాటు" అన్నాడు మార్క్స్. ఇప్పుడు స్పష్టమైంది. ఫ్రాన్సు ఒక్కదేశం కాదు రెండు దేశాలు. ఒకటి యజమానులదీ, మరొకటి పని వాళ్లదీ. ఫిబ్రవరిలో నినదించిన, జైలు గోడల మీదా, బారక్స్ గోడల మీదా రాసిన 'సోదరభావం' అనే మాట పెద్ద బూటకం. ఫిబ్రవరిలో జరిగింది మర్యాదస్తుల విప్లవం. దానిపట్ల అందరికీ సానుభూతి కలిగింది. 'సామాజిక న్యాయం' అనే మాట కవితాత్మకంగా ధ్వనించింది. జూన్‌లో జరిగింది పరువు మర్యాదలేని వాళ్ల అగ్లీ రివల్యూషన్, నాస్టీ రివల్యూషన్. ఇప్పుడు మాటల్లేవు. చేతలే ఉన్నాయి." జూన్‌లో జరిగింది – పెట్టుబడికీ, శ్రమశక్తికీ మధ్య జరిగిన అంతర్యుద్ధం. "దీర్ఘకాలిక కార్మిక పోరాటంలో అశువులు బాసిన త్యాగధనులు వీళ్లు" అంటూ మృతులకు నివాళి అర్పించాడు ఎంగెల్స్.

" ఇది 'వార్తా కథనం' ముసుగేసుకున్న యుద్ధ ప్రకటన అనటంలో సందేహం లేదు. ఫ్రాంక్‌ఫర్ట్, కొలోన్‌లలోనే కాదు బెర్లిన్‌లో కూడా ప్రమాద ఘంటికలు మోగాయి. నాలుగు రోజుల తర్వాత మార్క్స్ మాటల్లో "తీరని అరెస్టుల దాహంతో స్పందించారు పోలీసులు". తెల్లవారేలోగా పత్రికా సిబ్బంది ఇద్దర్ని అరెస్టు చేశారు. "పరిస్థితి ఇలాగే కొనసాగితే పత్రిక కార్యకలాపాలెలా కొనసాగుతాయి? ఈ కవ్వింపు చర్యల్లో ఎవరు గెలుస్తారో చూద్దాం. ప్రభుత్వమా? మా పత్రికా సంపాదకులా?" "

ఆ తర్వాత, కొద్ది రోజుల్లోనే పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయి. ఫిబ్రవరి విప్లవం ముగిసింది. కౌంటర్ రివల్యూషన్ (ప్రతీఘాత విప్లవం) ప్రారంభమైంది. తమ ఇష్టానికి వ్యతిరేకంగా సంస్కరణలు చేసిన రియాక్షనరీ శక్తులు జూలు విదిలించి తమ రాక్షస రూపం ప్రదర్శించాయి. కేవలం పారిస్‌లోనే కాదు, యూరోప్ అంతటా ప్రారంభమైంది వికృతక్రీడ. న్యూరైనిష్ జైటుంగ్‌లో ఫ్రెంచి అమరవీరులకు మార్క్స్ శ్రద్ధాంజలి ప్రచురించిన తర్వాత పత్రిక ఆర్థిక సహాయం చేస్తున్న మధ్య తరగతి షేర్ హోల్డర్లు తమ పెట్టుబడులను



విక్టర్ హ్యూగో

ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, అన్ని దేశాల బూర్జువా, పెటీ బూర్జువాలు పరాజితులైన కార్మికుల మీద దుష్ప్రచారం ప్రారంభించినప్పుడు, జర్మనీలో – ఒక రకంగా మొత్తం యూరోపులో – కార్మికుల పక్షం వహించింది మా పత్రిక అనే తృప్తి మిగిలింది" అన్నాడు ఎంగెల్స్.

జూన్ చివరి వారానికి లండన్, బ్రసెల్స్‌ల నుండి కమ్యూనిస్టు లీగ్ నాయకులు కొలోన్ చేరుకుని తదుపరి కార్యాచరణ కోసం సిద్ధంగా ఉన్నారు. కాని సంస్థనికి రద్దు చేయాల్సిందేనన్నాడు మార్క్స్. జనం తమ డిమాండ్ల గురించి వీధుల్లో బహిరంగంగా నినాదాలు చేస్తున్నప్పుడు సాయుధులై ప్రదర్శనలు నిర్వహిస్తున్నప్పుడు ఇంకా రహస్య సంస్థ ఎందుకన్నది ఆయన వాదం. ప్రతి విషయంలోనూ తద్వ్యతిరేక లక్షణాన్ని (వైరుధ్యాన్ని) చూడగలిగే మార్క్స్, విప్లవ పరాజయంలోనే విప్లవ విజయ బీజాలున్నాయన్నాడు. కాని, ఆ అంతిమ విజయంలో రహస్య సంస్థల పాత్ర మాత్రం ఉండదు. చీకటిలో, నీడలలో నిలిచి ఉద్యమించవలసిన అవసరం లేదు. ఇప్పుడు జరగాల్సింది ప్రత్యక్ష, బహిరంగ సమరమే. కొంత అసమ్మతి వ్యక్తమైనా చర్చల అనంతరం అందరూ సంస్థను రద్దు చేయటానికి అంగీకరించారు. తమ ఉద్యమ ప్రచారానికి 'న్యూరైనిష్ జైటుంగ్'ను ఒక ఆయుధంగా వాడుకోవాలని కూడా తీర్మానించారు. జర్మనీలో తిరిగి పుంజుకుంటున్న సాంప్రదాయిక, రియాక్షనరీ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చెయ్యాలి.

జూన్ 2 నాటికి, మార్క్స్ మాజీ సహచరుడు కాంప్ హౌసెన్ నాయకత్వంలో ఉన్న ప్రభుత్వం స్థానంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. దీనివి కూడా ఉదారవాద పాలసీలే అయినప్పటికీ, "పేదరికం పోవాలంటే శాంతిభద్రతల్ని పరిరక్షించాలి. రాజ్యాంగబద్ధమైన రాజరికం వ్యవస్థ తిరిగి

ఏర్పడాలి" అని ప్రకటించింది. రాజ్యాంగమైతే అమల్లోకి రాలేదు గాని, శాంతిభద్రతల పేరుతో ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. గాట్‌బాక్‌నూ మరో కార్మిక నాయకుణ్ణీ అరెస్టు చేసినట్టుగా రిపోర్టు చేసింది న్యూరైనిష్ జైటుంగ్. ఈ సందర్భంగా పోలీసు అధికారి ఒకరు తాగిన మత్తులో దురుసుగా ప్రవర్తించాడని కూడా పేర్కొంది. పత్రిక మీద న్యాయపరమైన చర్యలు తీసుకుంటానన్నాడా అధికారి.

జులై 6 నాడు అధికారులు మార్క్స్‌ను ప్రశ్నించారు. 10వ తేది నాడు కంపోజిటర్లను పిలిచి, రిపోర్టు రాసిన వ్యక్తి ఎవరో చెప్పమని ఒత్తిడి చేశారు. నెల తర్వాత న్యూరైనిష్ జైటుంగ్ సంపాదక వర్గాన్ని ఎటాక్ చెయ్యడం ప్రారంభించారు. కొలోన్ పోలీసులు భార్యా, ముగ్గురు పిల్లల్తో ఉంటున్న కార్ల్ షాపర్‌ను దేశం విడిచి వెళ్లమన్నారు. అతడు జర్మన్ పౌరుడే. అయినా విదేశీయుడని అతడిమీద అభియోగం మోపారు. మార్క్స్‌కు అర్థమైంది తన పౌరసత్వ సమస్య ఇంకా తేలలేదు. ప్రభుత్వం దృష్టిలో తనింకా విదేశీయుడే.

త్వరలోనే మార్క్స్ మిత్రులు, అనుయాయులందరికీ కొలోన్ ఒక ప్రమాదకరమైన నగరంగా మారింది. ఎప్పుడు పోలీసులు ఏ గొడవ సృష్టిస్తారో, ఎప్పుడు బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేస్తారోననే భయంతో వణికారు. యధేచ్ఛగా అరెస్టులు కొనసాగాయి. అప్పుడు కూడా అధికారులు రూల్సు పాటించలేదు. ఇంక అలాంటి మాటలకు అర్థమే లేదు. ఇచ్చిన హక్కుల్ని వెనక్కు తీసుకోవటంలోనే నిమగ్నమైంది ప్రష్యన్ అసెంబ్లీ. అయినా రాజుగారికింకా తృప్తి లేదు. అసెంబ్లీ కాలయాపన చేస్తున్నదనే అనుకున్నాడు. రాజకీయ సంక్షోభం తర్వాత మూడవ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. "బుద్ధిలేని అడ్డగాడిదలు నాయకత్వం వహించిన కౌంటర్ రివల్యూషనరీ విజయం" అని వ్యాఖ్యానించాడు మార్క్స్.

ఎటు చూసినా రాజకీయ, సామాజిక గందరగోళమే కనిపించింది. కొత్తగా ఏర్పడిన ప్రతినిధుల సభలు అచేతనంగా పడి వుంటే, "శాంతిభద్రతల పరిరక్షకులు" పారిస్, బెర్లిన్, వియన్నా నగరాలలో ప్రజాస్వామిక వాదులతో వీధి యుద్ధాలు చేశారు. ఆకలి బాధలతో రొట్టెపైన కోపం, బాధ బద్దలయ్యే సమయం వచ్చింది. ఫిబ్రవరికి ముందు ప్రభుత్వం పేదల్ని విస్మరించింది. జూన్ తర్వాత వాళ్లకు గుర్తింపు వచ్చింది – కాని ఆ గుర్తింపు వాళ్ల పట్ల పెరిగిన అపనమ్మకం, భయం మాత్రమే. ఉన్నత వర్గాల వాళ్లకు, పేదలంటే తృణీకారం, ద్వేషం. సానుభూతి అనే మాట లేదు. కార్మికుల్లో కూడా

పారిస్ నేషనల్ అసెంబ్లీ సభ్యుల సమావేశం

మార్పు వచ్చింది. ఎవర్నీ నమ్మకూడదు. ఎవరి మీదా ఆధారపడకూడదని తెలిసివచ్చింది. తమ హక్కుల్ని తామే రక్షించుకోవాలి. ఇంతవరకూ తాము పోరాటాలలో పరాజితులైన మాట నిజమే గాని, అనుభవంలో రాటుదేలారు. తమ పోరాట పటిమ తెలిసి వచ్చింది.

సెప్టెంబర్ 11, 1848 నాడు, కొలోన్‌లో తప్ప తాగిన సైనికులు ఒక యువతి పట్ల అసభ్యంగా ప్రవర్తించినప్పుడు స్థానిక సివిల్ గార్డ్

" జూన్ 26 నాటికి యుద్ధం పరిసమాప్తమైంది. కనీసం పదిహేను వందల మంది హతులయ్యారు. బారికేడ్లు ధ్వంసమైన తర్వాత కూడా సైనికుల హత్యాకాండ ఆగలేదు. తిరుగుబాటుదారులను వెదికి, వేటాడి మరీ చంపారు. ఆ వేట తర్వాత మృతుల సంఖ్య మూడు వేలకు పెరిగింది. పదిహేనువేల మందిని అరెస్టు చేశారు. నలభై అయిదువేల మందిని బలవంతంగా పశువుల మందల్లాగా అల్జీరియాకు తరలించారు. చాలా మందికి అక్కడికి వెళ్లటమంటే మరణశిక్షతో సమానం. "

సభ్యులు వాళ్లను అడ్డుకున్నారు. ఆ తర్వాతి పోట్లాటలో కొందరికి కత్తి గాట్లయినాయి. నిజానికిది, స్థానిక అధిక సంఖ్యాక కాథలిక్కులకూ, ప్రొటెస్టెంట్ ప్రష్యన్ సైన్యానికీ మధ్య రాజుకుంటున్న గొడవలకు పరాకాష్ఠ.

రెండు రోజుల తర్వాత, ఆరువేల మంది స్థానికులు కొలోన్ చర్చి వెనక సమావేశమై 'ప్రజారక్షక దళం' ఏర్పాటు చేసుకున్నారు. కొంతవరకిందులో మార్క్స్ ప్రమేయముంది. ఆనాటి ఉదయం న్యూరైనిష్ జైటుంగ్ పౌరులందర్నీ సాయంత్రం చర్చి వద్దకు చేరుకొమ్మని పిలుపునిచ్చింది. ఆ సమావేశంలో, మార్క్స్, ఎంగెల్స్, మరో అయిదుగురు జైటుంగ్ సంపాదకులు కూడా పాల్గొన్నారు.

ఆ తర్వాతి ఆదివారం జర్మన్ నేషనల్ అసెంబ్లీ వున్న ఫ్రాంక్‌ఫర్ట్‌లో హింస చెలరేగింది(డెన్మార్క్‌తో కుదుర్చుకున్న ఒక ఒప్పందంలో జర్మనీకి అవమానం జరిగిందన్నది ఒక కారణం). నిరసన కారుల్ని అడ్డుకోవటానికి సైన్యం రంగంలోకి దిగింది. అయినా, నలభై ఎనిమిది గంటల దాకా పరిస్థితి అదుపులోకి రాలేదు.

న్యూరైనిష్ జైటుంగ్ నిరసన కారుల పట్ల సానుభూతి ప్రదర్శించింది. వాళ్ల కుటుంబాలను ఆదుకోవటానికి విరాళాలు పోగు చేసింది. "ఇది తాత్కాలిక పరాజయం. విముక్తి సాధించే దాకా ఈ వీరులు ఆయుధాలు దించరు. ఇక మీద రాజ భవనాలూ, ధనవంతుల బంగళాలే లక్ష్యంగా పోరాటం కొనసాగుతుంది" అని రాశాడు ఎంగెల్స్.

ఇది 'వార్తా కథనం' ముసుగేసుకున్న యుద్ధ ప్రకటన అనటంలో సందేహం లేదు. ఫ్రాంక్‌ఫర్ట్, కొలోన్‌లలోనే కాదు బెర్లిన్‌లో కూడా ప్రమాద ఘంటికలు మోగాయి. నాలుగు రోజుల తర్వాత మార్క్స్ మాటల్లో "తీరని అరెస్టుల దాహంతో స్పందించారు పోలీసులు". తెల్లవారేలోగా పత్రికా సిబ్బంది ఇద్దర్ని అరెస్టు చేశారు. "పరిస్థితి ఇలాగే కొనసాగితే పత్రిక కార్యకలాపాలెలా కొనసాగుతాయి? ఈ కవ్వింపు చర్యల్లో ఎవరు గెలుస్తారో చూద్దాం. ప్రభుత్వమా? మా పత్రికా సంపాదకులా?"

సోమవారం నాటి అరెస్టుల విషయం తెలిసి హింస చెలరేగింది. లూటీలు, పోలీసులతో ఘర్షణలు, పగిలిపోయిన గ్యాస్‌లైట్లు. కొలోన్ నిండా పరచుకున్న గాజు పెంకులు. సాయంత్రం వరకు జనంతో నిండిపోయాయి వీధులు. నలభై బారికేడ్లు నిర్మించారు. ఆయుధాల షాపులు, ఇనప సామాను షాపులు లూటీ చేసి ఖడ్గాలు, గొడ్డళ్లు ఒకటేమిటి, ఏది దొరికితే అదే తీసుకెళ్లారు నిరసనకారులు.

మరునాటి మధ్యాహ్నం వరకు కొలోన్ నగరం 'ముట్టడి'లో ఉన్నట్టుగా ప్రకటించింది ప్రభుత్వం. కార్మికులకిక యుద్ధం చేసే అవకాశం చేజారిపోయింది. కొత్త నిబంధనల ప్రకారం 'సివిల్‌గార్డు'కు ఇప్పుడే అధికారాలూ లేవు. మద్యశాలల్ని రాత్రి పదింటికి మూసెయ్యాలని ఆజ్ఞలు జారీ అయ్యాయి. సమావేశాల మీదా, న్యూరైనిష్ జైటుంగ్, 'మరో నాలుగు వార్తా పత్రికల మీదా నిషేధం విధించారు. 'ఖడ్గం ముందు తలవంచింది కలం' అంటూ చందాదారులకు కరపత్రం విడుదల చేశారు మార్క్స్. అయినా ఈ పరిస్థితి ఎక్కువకాలం కొనసాగదులే" అని ఒక ధీమా.

సశేషం

▪ ఫోన్: 91776 18708

రేగుపండుతో రకరకాలు

చలికాలంలో వచ్చే తియ్యని పుల్లని రేగు పండ్లు నోరురిస్తాయి. వీటిని కొని అలా తినడమే కాదు.. రకరకాల రుచులు చేసుకొని ఆస్వాదించవచ్చు

వడలు

కావలసినవి: మినప్పప్పు–కప్పు, పుట్నాల పప్పు–అరకప్పు, బియ్యప్పిండి–అరకప్పు, రేగుపండ్ల ముద్ద– కప్పు, పచ్చిమిర్చి–ఏడెనిమిది(సన్నగా తరగాలి) జీలకర్ర–చెంచా, ఉప్పు–తగినంత, అల్లం–చిన్నముక్క, కొబ్బరికోరు–రెండు చెంచాలు, నూనె–వేయించడానికి సరిపడా.

తయారీ విధానం : ముందుగా మినప్పప్పును రెండు మూడు గంటల ముందు నానబెట్టుకుని తరువాత మెత్తగా రుబ్బుకోవాలి. ఈ పిండిని ఒక గిన్నెలోకి తీసుకొని నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ ఒక్కోటి చొప్పున వేసి బాగా కలపాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడిచేసి ఈ పిండిని వడల్లా అద్ది వేయాలి. ఎర్రగా వేగాక తీసేస్తే సరిపోతుంది. వేడి వేడి రేగు వడలు చాలా రుచిగా ఉంటాయి.

పాటోళీ

కావల్సినవి:గింజలు తీసేసి మరీ మెత్తగా కాకుండా చేసిన రేగుపండ్ల ముద్ద –రెండు కప్పులు, కందిపప్పు–ఒకటిన్నర కప్పు, ఆవాలు –రెండు చెంచాలు ,సెనగపప్పు, మినప్పప్పు–ఐదు చెంచాలు, కరివేపాకు రెబ్బలు–రెండుమూడు ,మినప్పప్పు –సరిపడా, నూనె–కప్పు, ఎండుమిర్చి–ఆరు, పచ్చిమిర్చి– ఆరు, కొబ్బరికోరు–రెండు చెంచాలు

తయారీ విధానం : ముందుగా కందిపప్పును నానబెట్టుకుని నీటిని వంపేయాలి. తడి లేకుండానే పొడిపొడిగా మినప్పప్పు, సెనగపప్పు, ఎండుమిర్చి వేయించాలి. ఆ తరువాత పొడుగ్గా తరిగిన పచ్చిమిర్చి, కరివేపాకు రెబ్బలు కూడా వేసి వేయించాలి. రెండు నిమిషాలయ్యాక రేగిపండ్ల ముద్ద వేయాలి. కాసేపటికి అది కూడా వేగుతుంది. అందులో సరిపడా ఉప్పు, కొబ్బరికోరు వేసి బాగా కలిపి కందిపప్పు ముద్దనుకూడా వేసేయాలి. మంట తగ్గించి మధ్యమధ్య నూనె వేస్తూ కలుపుతూ ఉండాలి. కాసేపటికి కందిపప్పు మిశ్రమం కూడా వేగి కమ్మని వాసన వస్తుంది. అప్పుడు దింపేయాలి. ఇది అన్నంలోకి రొట్టెల్లోకి చాలా బాగుంటుంది.

రేగు అన్నం

కావలసినవి: బియ్యం –రెండు కప్పులు, రేగుపండ్లు –నాలుగు కప్పులు, ఎండుమిర్చి–ఐదు, కరివేపాకురెబ్బలు– రెండు, ఉప్పు –తగినంత ,ఆవాలు–ఒకటిన్నర చెంచా, మినప్పప్పు, సెనగపప్పు–రెండు చెంచాలు, చింతపండు రసం–కొద్దిగా, ఇంగువ–కొద్దిగా, నూనె–పావుకప్పు, పచ్చిమిర్చి–మూడు ,పసుపు–పావు చెంచా, కొబ్బరికోరు– చెంచా.

తయారీ విధానం : బియ్యం కడిగి తగినంత ఉప్పు పసుపు వేసి కుక్కర్‌లో ఉడికించుకోవాలి, ఈ అన్నాన్ని మరో గిన్నెలోకి మార్చి అరనివ్వాలి, రేగుపండ్లనుశుభ్రంగా కడిగి తుడిచి గాట్లు పెట్టుకోవాలి. ఇప్పుడు బాణలిలో నూనె వేడిచేసి ఇంగువా , ఆవాలు, మినప్పప్పు, ఎండుమిర్చి, సెనగపప్పు వేయించాలి. ఆ తరువాత నిలువుగా తరిగిన పచ్చిమిర్చి కరివేపాకు రెబ్బలు కూడా వేయించి రేగుపండ్లు చెంచాల చింతపండు గుజ్జును కూడా వేసి మంట తగ్గించాలి రేగిపండ్లు మగ్గినట్టు అవుతాయి. అప్పుడు కొబ్బరికోరు వేసి దింపేయాలి. దీన్ని అన్నంలో వేసి బాగా కలిపేస్తే సరిపోతుంది.

ఊరగాయ

కావలసినవి: రేగుపండ్లు–కప్పు, కారం–పావుకప్పు, మెంతులు–ఒకటిన్నర చెంచా, ఆవాలు–ఐదు చెంచాలు, సెనగపప్పు–రెండు చెంచాల చొప్పున, నూనె –ముప్పావుకప్పు , ఇంగువ –అరచెంచా, ఉప్పు –తగినంత

తయారీ విధానం : బాణలిలో రెండు చెంచాల నూనె వేడిచేసి మినప్పప్పు ,సెనగపప్పు, ఆవాలు, మెంతులు వేయించుకునిపెట్టుకోవాలి. ఇవి చల్లారాక మిక్సీలో మెత్తగా పొడి చేసుకోవాలి. ఇప్పుడు బాణలిలో మిగిలిన నూనె వేడిచేసి ఇంగువ వేసి దింపేయాలి. ఇందులోనే కారం తగినంత ఉప్పు ముందుగా చేసిపెట్టుకున్న పొడి కడిగి తుడిచి అక్కడక్కడా గాట్లు పెట్టుకున్న రేగుపండ్లా వేసి కలపాలి. ఐదారుగంటలయ్యాక మరోసారి కలిపి తీసుకుంటే నోరూరించే ఊరగాయ వేడిచేసి అన్నంలో తినడమే ఆలస్యం.

హల్వా

కావలసినవి: రేగుపండ్లు–రెండు కప్పులు, బెల్లం–కప్పు, చక్కెర–కప్పు, యాలకులపొడి–అరచెంచా, నెయ్యి–అరకప్పు, పుట్నాలపొడి–కప్పు

తయారీ విధానం : రేగుపండ్లను తొడిమతీసి మూడు ముక్కలుగా చేస్తే గింజ వచ్చేస్తుంది. ఇలా మిగిలిన పండ్లను కూడా చేసుకోవాలి. ఇప్పుడు పొయ్యిమీద బాణలి పెట్టి నెయ్యి కరిగించి రేగుపండ్ల ముక్కల్ని దోరగా వేయించుకోవాలి. అందులోనే చక్కెర వేసిబాగా కలపాలి. మంట తగ్గించి కలుపుతూ ఉంటే చక్కెర కరిగి పాకం వస్తుంది. ఆ తరువాత ఒక్కో పదార్థాన్ని వేసేయాలి. బెల్లం కూడా కరిగి పాకం రానివ్వాలి. మధ్యమధ్యలో కలుపుతూ ఉంటే హల్వా దగ్గర పడుతుంది. అప్పుడు దింపేయాలి. పులపుల్లని తియ్యని రేగుపండ్ల హల్వా సిద్ధం.




ఏమేం వున్నాయి?

నాలుగు ప్రాణులను కలిపి ఈ బొమ్మను తయారుచేశారు. ఇంతకీ ఏంటవి?

జవాబు: కుక్క తల, కంగారూ శరీరం, పెంగ్విన్ కాళ్లు, కోడి తోక.

ఏది ఎక్కడబ్బా...



అంకుల్ చొక్కా భలే వుంది. అయితే పాపం ఇస్త్రీ చేస్తుంటే ఎ, బి, సి అని మూడు రంధ్రాలు పడ్డాయి. ఆ మూడు ముక్కలను బయట ఇచ్చాం. ఇంతకీ ఈ మూడింటిని చొక్కాలోని రంధ్రాలకు జత చేయాలి. అంటే ... చొక్కా మీద ఎక్కడ ఏ నెంబరు అతికిస్తే సరిగ్గా సరిపోతుందో చూసి చెప్పాలి.

జవాబు: ఎ-3, బి-2, సి-1.

మామిళ్లు ఎన్ని వున్నాయోచ్!



పిల్లలకు తెలివి తేటలు పెరిగిపోతున్నాయ్. ఇదివరకైతే చెట్లెక్కి కిందపడి కాళ్లు, చేతులు విరక్కొట్టుకునేవారం. ఇప్పుడో నిలబడిన చోటు నుంచే కోసేస్తున్నారు మామిడిపళ్లు. ఇంతకీ బుజ్జి కోసిన పళ్లు, చెట్టు మీదున్న పళ్లు ఎన్నో చెప్పకోండి?

జవాబు: మొత్తం పదకొండు.

క్యారెట్లు ఎన్ని?

కుందేలుకు క్యారెట్లంటే ఎంతిష్టమో!
ఇంతకీ బుట్టలో ఎన్ని క్యారెట్లు వున్నాయి?



జవాబు: కుందేలు చేతుల్లోవి, బుట్ట కిందివి లెక్కించ కూడదు. కేవలం బుట్టలో వున్నవి పది.

నేను గీసిన బొమ్మ

సుధీర్ కుమార్,
నాల్గవ వరగతి, జిల్లా పరిషత్ హైస్కూల్,
విజయవాడ.

చుక్కలు కలిపేద్దాం



దారేది?

చీపురు మీద వున్న చిన్నోడు ...అదిగో ఆ ఇంట్లోకి వెళ్లాలనుకుంటున్నాడు. మరి మేఘాలను దాటుకుని ఆ ఇంట్లోకి వెళ్లేదెలాగో చెప్పండి!

చకచకా పూరిస్తే...



ఇక్కడ కొన్ని గళ్లు, బొమ్మలు ఇచ్చారు కదా. ఆ బొమ్మలను ఇంగ్లీషులో ఏమంటామో గళ్లలో రాయాలి. చకచకా...

జవాబు: bird, broom, mouse, scarf, flower, straw, corn, coin.

పళ్లు విత్తనాలే ఆహారం

టుకాన్- మెత్తటి పళ్లను తింటుంది.

క్వెయిన్- ఇది ధాన్యాలను తింటుంది.



రామచిలుక- పళ్లను, పిక్కలను తింటుంది.

క్రాస్ బిల్- ఎండిన పైన్ పళ్ల విత్తనాలను పొడుచుకుని తింటుంది.

సంభ్రమాశ్చర్యాలను కలిగించే కథలు

ఈ కథలు విపుల, నవ్య పత్రికల్లో తొలుత ప్రచురించబడినవే. రచయితలు వూహించిన శాస్త్ర, సాంకేతిక భవిష్యద్దర్శనమే సైన్స్ ఫిక్షన్. కొత్త గ్రహాల, నక్షత్రాల ఆవిష్కరణ, వ్యోమనౌకలు ఇదంతా సైన్స్ ఫిక్షన్‌కు కథావస్తువు.

నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై కాలూనక ముందే ఆ అంశంతో రచయిత నవలరాసి పాఠకలోకాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచి వేసారు. ఇది రచనా ప్రక్రియలోనే సంచలనం ఒకనాడు. జూల్స్ వెర్న్, హెచ్.జి.వుల్స్ లాంటి ఆధునిక సైన్స్ ఫిక్షన్ రచయితల్లో ముఖ్యులు. అమెరికా లాంటి దేశాల్లో సైన్స్ ఫిక్షన్ కథలకు "క్రేజ్" ఉన్నది(చాలా పాశ్చాత్య దేశాల్లోనూ ఉంది). రష్యన్ అర్కాడే బోరిస్ స్ట్రగాట్ స్కీ, స్లానిస్లా వెమ్ (పోలాండ్), సాక్యో కోమాట్సూ(జపాన్), హోర్హెలూయియూ బోర్హెస్(అర్జెంటీనా)లు సైన్స్ ఫిక్షన్ కథలు రాసిన ఇతర దేశాల రచయితల్లో ముఖ్యులు. ఈ కథా సంపుటిలో23 కథలున్నాయి. ఫిజిక్స్(భౌతిక శాస్త్రం) తెలిసినవారికి తేలిగ్గా, తాజాగా ఉంటాయి. విషయ సూచికలో రచయిత, ఆయన కథ పేరు పేజి.నెం.తో ఇచ్చారు. కథారచనలో మంచి పట్టున్న ముక్తవరం పార్థసారధి ఈ కథల్ని అనువాద కథల్లా కాక...తెలుగు కథల్లా అనిపించే రీతిలో రాసారు. అన్వేషి, యంత్ర జగతి, మౌలిక ప్రశ్న, ఎలుకలు, టైం ఎక్స్‌పోజర్స్, బలి, గూఢాచారి!, కలకానిది, ఎండలో ఏకాకి, జన్యు విప్లవం, బుద్ధం శరణం, బ్రహ్మ నిద్ర, సూర్యుడితో కరచాలనం, యంత్ర విజయం, అనుకోని అతిథి, జన్మాంతర యానం, దైవ నామాలు, అమరులెవరైనా లాంటి కథలు...ఈ సంపుటిలో ఉన్నాయి.



రోదసి క్లాసిక్ సైన్స్ ఫిక్షన్ కథలు
తెలుగు సేత: ముక్తవరం పార్థ సారధి
పేజిలు : 176, వెల: రూ125
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్...అన్ని బ్రాంచీల్లో
సెల్ నెం: 9177618708

బోనారస్ రాసిన "ద్రోహి" కథ చారిత్రక ప్రాధాన్యమైనది. "అలెగ్జాండర్" జీవిత చివరి రోజుల్లోని కథాంశం...సింధు నదీ తీరం, అలెగ్జాండర్ గుడారం...దానిలోకి ఒక అగంతకునిలా దెయ్యం ఆత్మ రావడం, మాట్లాడటం. యుద్ధ పిపాసి క్షేమంగా తిరిగి వస్తాడా అని అలెగ్జాండర్ భార్య రోక్సాన్ అడగటం, మరణించిన క్లీటస్ ప్రేతాత్మగా వచ్చి మాట్లాడే స్థితి కథాంశం. "ఎలుకలు"(పేజి.138) కథ కూడా బాగా నడిచింది. పాఠకుల్లో ఉత్సాహం పెంచుతుంది. 1950లలో ప్రారంభమైన రాకెట్ ప్రయోగాలు కేప్ కెనా వెరాల్ లాంచింగ్ స్టేషన్‌లో జరిగిన ఘటనలు...ప్రయోగాలకు అంతరిక్షంలోకి ఎలుకలు పంపడం...శాస్త్రజ్ఞుడు రేడియో ఆస్ట్రానమీ పరిశోధనల వల్ల ఫలితాలు...ఎలుకలు...డైనోసర్లు అంతగా పెరగడం(మారడం) లాంటి అంశాలు పిల్లలకు ఆసక్తి కలిగిస్తాయి. విగ్రహారాధన మూఢ విశ్వాసమైతే, డైనమో ఆరాధన ప్రాణాంతకం అనే సత్యాన్ని"డైనమే దేవుడు" కథ చెబుతుంది. ప్రతి కథ ముందు ఆ కథకుని బయోడేటా(రచనలు) ఇవ్వడం బాగుంది. సైన్స్‌పై అవగాహన ఆసక్తి ఉన్నవారికి ఇవి తేలిగ్గా అర్థం అవుతాయి.

✦

◆ కొత్త పుస్తకాలు

మధ్యతరగతి మనస్తత్వాలకు ప్రతిబింబాలు

ఆంధ్ర పత్రిక, స్వాతి, ఆంధ్రభూమి, సినీ హెరాల్డ్ లాంటి పత్రికల్లో ప్రచురణైన కథలే ఇవి. 15 కథలు...ఈ సంపుటిలో ఉన్నాయి. ఆకట్టుకునే కథలు అంటూ అలపర్తి రామకృష్ణ చక్కటి ముందు మాట రాసారు. సుధాకరరావు1973 నుండి సాహిత్య వ్యాసంగం కొనసాగిస్తున్నారు. తానా కథల పోటిల్లోనూ వీరి కథలకు బహుమతులొచ్చాయి. నిత్య జీవితంలో ఎదురయ్యే సంఘటనల నుంచే తన కథలు పుట్టాయని రచయిత చెప్పారు.



ప్రతిఘటన కథలు
రచయిత : అవధానుల సుధాకరరావు
పేజిలు : 132 వెల : రూ 80
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్ శాఖలన్నింటిలో...
ఫ్లాట్ నెం: 203, వరలక్ష్మి అపార్ట్‌మెంట్స్, అల్కాపురి- రోడ్ నెం 5, హైద్రాబాద్.35
సెల్ : 9493410034

"జీవితం చేజారింది" కథ తెలుగు సినిమాలా పురుష పక్షం వైపుగానే నడిచింది. భరణి, సునీత భార్యాభర్తలు. వారి కొడుకు దినేష్. అనుకోని పరిస్థితుల్లో సునీత ఆత్మహత్యచేసుకోవడం...కోర్టులో తండ్రి నిర్ధోషిగా దినేష్ సాక్ష్యం చెప్పడంతో...కోర్టు కేసు కొట్టివేసి భరణిని విడుదల చేస్తుంది. ఉత్తరం ద్వారా మిత్రునికి(భాస్కరానికి) లేఖ రాయడంతో ఈ కథ ప్రారంభం అవుతుంది. భాస్కరం ఇతర తన మిత్రులను వెంటతీసుకొని తిరుపతి వెళ్లడం...'కోర్టు' తీర్పు...భరణి మామగారి క్రూరత్వం...కథలోని ముఖ్యాంశాలు. ఆర్థిక అంశాల్లో భార్యా భర్తల మధ్య కీచులాటలు...బేధాభిప్రాయాలూ కథీకరిచారు కదా!!

ఒక దళిత యువకుని జీవనంలోని విషాద సంఘటనలు కళ్లకు కట్టినట్లుగా చూపించిన కథే "ప్రతిఘటన". పరస్త్రీ వ్యామోహ పరుడ్ని, కన్న తల్లిదండ్రులు కూడా ఛీ కొట్టి...కోడలి పక్షం నిలబడే స్థితి చెప్పే "వ్యక్తిత్వం" కథ శీల సంపద ప్రాధాన్యత తెలియచేస్తుంది. చాలా కథాంశాలు...తెలుగు సినిమా ధోరణిని ప్రతిబింబిస్తాయి. ఇంకా ఈ సంపుటిలో పుట్టిన రోజు, నాకు విడాకులు కావాలి, ఆలంబన, కుక్కతోక, స్వర్గం, ముల్లు, అమ్మంటే?, ఓ నాన్న, తొంభై కేజిల మొగుడు, మహారాజశ్రీ మొగుడు గారు...లాంటి కథలున్నాయి.

అలపర్తి వారు అన్నట్లుగా అవధానుల సుధాకరరావుగారి కథల్లో ఎక్కడా వస్తువును మింగేసే శైలి, భాషాడంబరం కనిపించవు.

ఏకబిగిన చదివిస్తాయి. దేశభక్తి...స్వాతంత్ర్యాన్ని నిలబెట్టాలనే రీతిలో చెప్పాల్సిన అంశాన్ని బలంగా కథీకరించలేకపోయిన "పుట్టినరోజు"కథ. కొన్ని కథల్లో వ్యంగ్యం బాగా తొణికిసలాడింది. మహిళా సాధికారతకు "విడాకులు" పరిష్కారమా? స్వేచ్ఛ-ఇగోయిజం పరోక్షంగా ప్రోత్సయింపుగా సాగినట్లు అనిపించిన కథ "నాకు విడాకులు కావాలి" అనిపించింది. ఇద్దర్ని కలపడం గొప్పకాని, విడదీయడం కాదు కదా! మధ్యతరగతి మనస్తత్వాన్ని కథీకరించిన అవధానులవారు మరిన్ని మంచి కథలు రాయాలి.

- తంగిరాల చక్రవర్తి



ఎవరికేం సమాచారం కావాలన్నా... వెంటనే గుర్తొచ్చేది గూగులే. అంతగా అందరి ఆదరణ పొందడానికి గూగుల్ చేసే కృషి కూడా కారణమే. సందర్భానుసారం గూగుల్ తయారుచేసే డూడుల్స్ అంత ఆకర్షణీయంగా వుంటాయి మరి. పండుగ కావొచ్చు. పబ్బం కావొచ్చు. ప్రముఖుల జయంతి వర్ధంతులు కావొచ్చు. ముఖ్యమైన తేదీలు ... జాతీయ, అంతర్జాతీయ పండుగలు కావొచ్చు. అన్నింటినీ తనదైన ముద్రతో సృజించిన డూడుల్స్‌తో ఆకట్టుకోవడం గూగుల్ ప్రత్యేకత. మీ ముందున్నవన్నీ ... గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేసినవే. ముువ్వన్నెల జండా, ఎర్రకోట, జాతీయ పక్షి నెమలి, జాతీయ జంతువు పులి, నేల మీద...నింగిలో సైనికుల విన్యాసాలు, అంబారీలు...డూడుల్స్‌లో ఇమడ్చడం గూగుల్ పత్యేకత. ●

డూ..డుల్

బొమ్మలా...! పిల్లలా...!

‘వావ్...బొద్దుగా...ముద్దుగా ఎంత బావున్నారో ఈ బుజ్జాయిలు....!’ అనుకుంటున్నారా?! అయితే పొరపాటు పడ్డట్టే. నిజానికి వీళ్లు పిల్లలు కాదు. అచ్చంగా పిల్లల్లా కన్పించే బొమ్మలు. పరిశీలనగా చూస్తే మీకే తెలుస్తుంది. కాకపోతే... అలా భ్రమింపచేసిన ఘనత మాత్రం న్యూయార్క్‌కు చెందిన జామీ డైమండ్ అనే ఫొటోగ్రాఫర్‌దే. నవమాసాలు మోసి బిడ్డను కంటుంది తల్లి. బిడ్డల్లాంటి బొమ్మలను తయారు చేసేందుకు తొమ్మిది నెలల పాటు ఒక కోర్సు నేర్చుకుంది జామీ . వీటి ప్రత్యేకత ఏంటనుకున్నారు? చర్మం రంగు, వెంట్రుకలు, కనుగుడ్లు. వీటి విషయంలో జామీ ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తుంది. బొమ్మలకు సహజసిద్ధంగా అనిపించేలా రంగులు వేసి... దానిమీద పల్చపాటి గ్లాసు పొర అతికిస్తుంది. ఇంతే కాదండోయ్! బొమ్మల మీద ఒకరకమైన సెంటు చల్లుతుంది. దాంతో పసిపిల్లల దగ్గర మాత్రమే వచ్చే ప్రత్యేకమైన వాసన ఈ బొమ్మల నుంచి వస్తుందట. నిజానికి ఇవి పిల్లలనే కాదు! సంతానం లేని పెద్దలనూ.. పసిపిల్లలను ఇష్టపడే వారినీ ... ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.